నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

మధ్యాహ్న భోజనం తిన్న 31 మంది విద్యార్థులకు అస్వస్థత

వరంగల్, ఫిబ్రవరి 26:హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శ్రీరాములపల్లిలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శ్రీరాములపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన అనంతరం 31 మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు కాగా.. వారిని కమలాపూర్ పీహెచ్‌సీకి తరలించారు. కలుషిత ఆహారం కారణంగానే ఇలా జరిగినట్లు వైద్యులు వెల్లడించారు. పలువురు విద్యార్థులు బలహీనంగా ఉన్నారని పేర్కొన్నారు.

హైదరాబాద్ ఆదివారం 27-2-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 173 పేజీలు:4 వెల: రూ.1/-

రష్యా చర్యలపై ఐరాస భద్రతా మండలిలో ఓటింగ్‌కు భారత్ దూరం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:ఉక్రెయిన్‌లో రష్యా చర్యలపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో (ఐఔూఅ) ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉన్నది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అత్యవసరంగా సమావేశమయింది. రష్యా దాడిని ఖండిస్తూ భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానాన్ని రష్యా వీటో చేసింది. మండలిలోని మొత్తం 15 సభ్యదేశాల్లో 11 దేశాలు రష్యాకు వ్యతిరేకంగా ఓటు వేశాయి. అయితే మొదటి నుంచి ఉక్రెయిన్-రష్యా వివాదంలో తటస్థంగా ఉన్న భారత్‌తో పాటు చైనా, యూఏఈలు ఈ ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. కాగా, భద్రతా మండలిలో ఐదు శాశ్వత దేశాల్లో ఒకటైన రష్యా తన విటో అధికారాన్ని ఉపయోగించి ముసాయిదాను తిరస్కరించింది.అంతకుముందు ఐరాసలో భారతరాయబారి టీఎస్ తిరుమూర్తి మాట్లాడుతూ.. ఉక్రెయిన్‌లో ఇటీవల జరుగుతున్న పరిణామాల పట్ల భారత్ తీవ్ర ఆందోళనకు గురవుతున్నదని చెప్పారు. హింసను తక్షణమే నిలిపివేయడానికి తగిన ప్రయత్నాలు చేయాలని కోరుతున్నామన్నారు. మానవాళి ప్రాణాలను పణంగాపెట్టడం వల్ల ఎలాంటి పరిష్కారం లభించదని తెలిపారు.

3500 మంది రష్యా సైనికులు మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:ఉక్రెయిన్‌పై దాడికి దిగిన రష్యాకు కూడా భారీ నష్టమే జరిగింది. ఇప్పటి వరకు సుమారు 3500 మంది రష్యా సైనికులు చనిపోయినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తన ఫేస్‌బుక్ పేజీలో అప్‌డేట్ చేసింది. మరో 200 మంది రష్యా సైనికుల్ని అరెస్టు చేసినట్లు చెప్పారు. దీనికి తోడు 14 విమానాలను, 8 హెలికాప్టర్లను, 102 యుద్ధ ట్యాంక్‌లను కూడా రష్యా కోల్పోయినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. అయితే ఈ సమాచారాన్ని ఎవరూ ధ్రువీకరించలేదు. ప్రస్తుతం జరుగుతున్న దాడిలో మృతులకు సంబంధించిన వివరాలను ఇప్పటి వరకు రష్యా వెల్లడించలేదు.

ఉక్రెయిన్‌పై మిస్సైళ్ల వర్షం కురుస్తోంది. నల్ల సముద్రం నుంచి రష్యా తన క్షిపణులను రిలీజ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అనేక ప్రాంతాల్లో వైమానిక దాడులు జరుగుతున్నాయి. రష్యా దళాలను ఉక్రెయిన్ ధీటుగా ఎదుర్కొంటున్నట్లు పశ్చిమ దేశాలు పేర్కొన్నాయి. కీవ్ నగరం వద్ద రష్యా బలగాలకు ఉక్రెయిన్ ఆర్మీ ధీటుగా బదులిస్తోంది. దీంతో అక్కడ హోరాహోరీ పోరు సాగుతోంది. వీలైనంత త్వరగా విక్టరీ సాధించాలనుకుంటున్న రష్యా ఈ నేపథ్యంలో భారీ దాడికి ప్రయత్నిస్తోంది.

కీవ్ నుంచి పారిపోలేదు- ఆయుధాలు వీడేది లేదు: ఉక్రెయిన్ అధ్యక్షుడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: తాను కీవ్ నుంచి పారిపోలేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. తాను పోరిపోయినట్లు వస్తున్న పుకార్లను ఆయన ఖండించారు. ఆయుధాలు వీడేది లేదని ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు ఒక సెల్ఫీ వీడియోను తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. 'నేను ఇక్కడే ఉన్నాను. మేము ఆయుధాలను వీడం. మా దేశాన్ని కాపాడుకుంటాం. మా ఆయుధాలనే నమ్ముకున్నాం. ఆయుధాలు వీడి లొంగిపోవాలంటూ సైన్యానికి నేను చెప్పినట్లుగా నకిలీ వార్తలు వస్తున్నాయి. వాటిని నమ్మవద్దు' అని ప్రజలనుద్దేశించి అన్నారు.

కాగా, తాను అలసిపోయినట్లుగా కనిపిస్తున్నప్పటికీ చాలా దృఢనిశ్చయంతో ఉన్నానని జెలెన్‌స్కీ తెలిపారు. 'ఇదే మా భూమి, మా దేశం, మా పిల్లలు అన్నింటినీ మేం కాపాడుకుంటాం' అని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం మూడో రోజుకు చేరిన నేపథ్యంలో రష్యా దళాలు కీవ్‌లోకి దూసుకొస్తూ దాడులను తీవ్రం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రాత్రి మనందరికీ కాళ రాత్రి అని జెలెన్‌స్కీ అన్నారు.

కీవ్ వీధుల్లో భీకర పోరు.. ధీటుగా ప్రతిఘటిస్తున్న ఉక్రెయిన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:కీవ్‌పై కన్నేసిన రష్యాకు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. ఉక్రెయిన్ రాజధాని సరిహద్దుల్లోకి ప్రవేశించిన రష్యా దళాలకు స్థానిక ఆర్మీ ముచ్చమటలు పట్టిస్తోంది. రష్యా భీకర దాడులు చేస్తున్నా.. తమ ఆర్మీ ధీటుగా బదులు ఇస్తోందని ఉక్రెయిన్ మిలిటరీ తన ఫేస్‌బుక్ పేజీలో పోస్టు చేసింది. సిటీలోని ఓ ప్రధాన వీధి వద్ద రష్యా బలగాలను తమ ఆర్మీ యూనిట్ వెనక్కి వెళ్లేలా చేసినట్లు ఎఫ్‌బీ పేజీలో ఉక్రెయిన్ సైన్యం పేర్కొన్నది. వీధుల్లో భీకర స్థాయిలో పోరాటం జరుగుతోందని, ప్రజలు ఇండ్లకే పరిమితం కావాలని కీవ్ నగర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. వాసిల్కీవ్ ప్రాంతంలో హోరాహోరీ పోరు సాగుతున్నట్లు ఉక్రెయిన్ తెలిపింది. పలు రష్యా టార్గెట్లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ దళాలు పేర్కొన్నాయి. వాసిల్కీవ్ ఎయిర్‌బేస్‌పై రష్యా పారాట్రూపర్లు దాడి చేశారు. వారిని ఉక్రెయిన్ ఆర్మీ కమాండోలు ధీటుగా తిప్పికొట్టారు. రష్యాకు చెందిన ట్రాన్స్‌పోర్ట్ విమానాన్ని కూడా పేల్చివేసినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది.

సీఎం కేసీఆర్ విజన్‌తో దేశానికే ఆదర్శంగా తెలంగాణ : తలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 26:సీఎం కేసీఆర్ సంకల్పంతో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేపై లక్ష్మీనగర్ వద్ద రూ.5కోట్ల వ్యయంతో మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) నిర్మించిన డౌన్ ర్యాంప్‌ను మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరం జనాభా పెరుగుదల, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా అన్ని రకాల మౌలిక సదుపాయాలను ఒనగూర్చుకుంటుందని మంత్రి అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ విజన్‌తో హైదరాబాద్ జంటనగరాల రూపురేఖల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు.

కనెక్టివిటీ, హాస్పిటాలిటీ, శాంతిభద్రతలు, మూడు దశాబ్దాల భవిష్యత్‌ను ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మంత్రి కేటీఆర్ మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారన్నారు. ప్రణాళికల రూపకల్పన, రోడ్లు, ఫ్లై ఓవర్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్న హెచ్ఎండీఏ యంత్రాంగాన్ని మంత్రి శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎం.శ్రీలత, గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, సెక్రెటరీ పీ చంద్రయ్య, సూపరింటెండెంటింగ్ ఇంజినీర్స్ యూసుఫ్ హుస్సేన్, పరంజ్యోతి, ఇంజినీర్లు రజిత, గౌతమి, విద్యాసాగర్, వెంకటేశ్, అశుతోష్ కుమార్ పాల్గొన్నారు.

లక్ష మంది ఉక్రెయిన్ ప్రజలు వలస వెళ్లారు.. 4 లక్షలకు చేరొచ్చని ఓ అంచనా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:ఉక్రెయిన్‌పై రష్యా బాంబులతో విరుచుకుపడుతోంది. మూడో రోజూ ఇది కొనసాగుతోంది. పలు నగరాలు, సైనిక స్థావరాలు, ప్రజలు నివాసముండే అపార్ట్‌మెంట్‌లపై కూడా రష్యా సైన్యం దాడులకు దిగింది. దీంతో ప్రజలందరూ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బంకర్లు, మెట్రో స్టేషన్లు? ఇలా మరి కొన్ని రహస్య స్థావరాల్లో తలదాచుకుంటున్నారు. మరి కొందరు కార్లతో సహా పలు వాహనాల్లో వలస వెళ్లిపోతున్నారు. అయితే.. ఉక్రెయిన్ అధికారుల ప్రకారం ఇప్పటి వరకూ ఓ లక్ష మంది ఉక్రెయిన్ పౌరులు వలస వెళ్లిపోయారని పేర్కొంటున్నారు.

రొమానియా, పోలాండ్, మోల్‌డోవా స్లోవాకియా హంగేరీ ప్రాంతాలకు తరలిపోయారు. వీరి బాధ వర్ణనాతీతం. అంతర్జాతీయ శరణార్థుల ఏజెన్సీ ప్రకారం ఇప్పటి వరకూ ఓ లక్ష మంది ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలిపోయారని తెలుస్తోంది. పరిస్థితి ఇంకా క్షీణిస్తే మాత్రం ఈ సంఖ్య 40 లక్షలు దాటే ప్రమాదముందని ఆ సంస్థ పేర్కొంది.

అయితే ఈ వలస వెళ్లే వారిలో అత్యధికులు మహిళలే వుంటున్నారు. రష్యాకు వ్యతిరేకంగా ప్రతీ ఉక్రెయిన్ పౌరుడూ పోరాడాల్సిందేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో పెట్టుకునే ఉక్రెయిన్‌లోని పురుషులు తమ తమ స్థావరాల్లోనే ఉండిపోతున్నారని తెలుస్తోంది.

ఓయో రూమ్స్‌పై పోలీసుల నజర్.. చర్యలు తప్పవంటూ హెచ్చరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 26:హైదరాబాద్ పరిధిలోని ఓయో రూమ్స్‌పై పోలీసులు దృష్టి సారించారు. ఈ రూమ్స్‌లో ప్రయివేటు పార్టీలు జరుగుతున్నట్లు గుర్తించాని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. బషీర్ బాగ్‌లోని సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.ఓయో రూమ్స్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి అని సూచించారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఓయో సెంటర్ వద్ద సీసీ కెమెరాలు అందుబాటులో ఉంచాలన్నారు. 6 నెలల స్టోరేజీని తప్పనిసరిగా భద్రపరచాలని ఆదేశించారు. ఓయో రూమ్ బుక్ చేసుకున్నప్పుడు ఐడీ కార్డుతో పాటు ఇతర వివరాలను కచ్చితంగా నోట్ చేసుకోవాలని సీపీ సూచించారు

ఫ్రాన్స్ వినూత్నంగా సంఘీభావం- ఉక్రెయిన్ జెండా రంగుల్లో మెరిసిన ఈఫిల్ టవర్

పారిస్, ఫిబ్రవరి 26: ఉక్రెయిన్‌పై రష్యా దాడిని అమెరికాతోపాటు ఐరోపా యూనియన్ ఖండించింది. ఐరోపాలో బ్రిటన్ తర్వాత మరో ముఖ్య దేశమైన ఫ్రాన్స్, ఉక్రెయిన్‌కు తన సంఘీభావాన్ని వినూత్నంగా ప్రకటించింది. రాజధాని పారిస్‌లోని ప్రసిద్ధ ఈఫిల్ టవర్ ఉక్రెయిన్ జాతీయ జెండా రంగులతో కాంతులీనింది. ఉక్రెయిన్ ప్రజలకు సంఘీభావంగా నీలం, పసుపు రంగుల్లో ఈఫిల్ టవర్ వెలిగిపోయిందని పారిస్ మేయర్ అన్నే హిడాల్గో తెలిపారు. ఆ సమయంలో అక్కడున్న సందర్శకులు ఉక్రెయిన్ జాతీయ జెండా రంగుల్లో మెరిసిన ఈఫిల్ టవర్‌ను తిలకించి పులకించారు. ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు.

కాగా, ఉక్రెయిన్‌పై రష్యా దాడిని నివారించేందుకు తమ దేశంతోపాటు ఈయూ అన్ని ప్రయత్నాలు చేసిందని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రన్ తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి ఐరోపా చరిత్రలో టర్నింగ్ పాయింట్ అని చెప్పారు. దీని వల్ల తమ దేశాలపై చాలా ప్రభావం ఉంటుందన్నారు. ఉక్రెయిన్‌పై దాడికి దిగిన రష్యాకు తాము చాలా కూల్‌గా బదులిస్తామని హెచ్చరించారు. రష్యాపై ఆంక్షలు విధించడంలో తాము ఏమాత్రం బలహీనులం కాదని స్పష్టం చేశారు.

మరోవైపు నాటోలో కీలక దేశమైన ఫ్రాన్స్, ఉక్రెయిన్‌కు ఆయుధాలను అందిస్తున్నట్లు శనివారం తెలిపింది. ఈ నేపథ్యంలో రష్యాకు ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రన్ వార్నింగ్ ఇచ్చారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం ఇప్పట్లో ముగియదన్నారు. చాలా సుదీర్ఘమైన యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు సిద్ధంగా ఉండాలన్నారు. ఆ దేశ వార్షిక వ్యవసాయ సదస్సులో పాల్గొన్న మాక్రన్ మాట్లాడుతూ.. 'ఈ సంక్షోభం చాలా రోజులు ఉంటుంది. ఈ యుద్ధం చాలా ఏళ్లు కొనసాగుతుంది. దాని వల్ల వచ్చే సంక్షోభ పర్యవసానాలను ఎదుర్కొనేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలి' అని అన్నారు.

కీవ్‌ను కాపాడుకున్నాం.. ఉక్రెయిన్ అధ్యక్షుడి ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26ఉక్రెయిన్ రాజధాని కీవ్‌ను హస్తగతం చేసుకోవాలనుకున్న రష్యా బలగాలను అడ్డుకున్నామని ఆ దేశాధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రకటించారు. "రష్యా బలగాలను మన మిలటరీ అడ్డుకుంది" అని ఆయన చెప్పారు. కీవ్‌ను స్వాధీనం చేసుకొని, తన అడ్డు తొలగించుకోవాలనుకున్న రష్యా బలగాల ఆశ నెరవేరలేదన్నారు. అలాగే తమ దేశంపై చొరబాటును ఆపాల్సిందిగా వ్లాదిమిర్ పుతిన్‌పై ఒత్తిడి చేయాలని రష్యా ప్రజలను కోరారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన జెలెన్‌స్కీ.. రాజధాని కీవ్, దాని చుట్టుపక్కల ఉన్న ప్రధాన పట్టణాలను రష్యా బలగాల నుంచి కాపాడుకున్నట్లు వెల్లడించారు. తాజాగా ఉక్రెయిన్ మిలటరీ ప్రతిఘటిస్తున్నప్పటికీ రష్యా బలగాలు కీవ్‌కు 30 కిలోమీటర్ల దూరంలోకి వచ్చేశాయని యూకే రక్షణ శాఖ ఒక ప్రకటన చేసింది. ఈ నేపథ్యంలోనే తాము కీవ్‌ను కాపాడుకున్నట్లు జెలెన్‌స్కీ ప్రకటించారు.

అదే సమయంలో తమ దేశానికి మద్దతుగా రష్యాలో నిరసనలు చేస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఇలాగే రష్యా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి చేయాలని కోరారు. "మీకు, మాకు, ప్రపంచానికి అబద్ధాలు చెప్పేవాళ్లను అడ్డుకోండి" అని అభ్యర్థించారు. తమ దేశంలోకి చొరబడినందుకు రష్యా ప్రభుత్వాన్ని శిక్షించాలని, ఆ దేశానికి స్విఫ్ట్ (సాచిఎఈఉ) వ్యవస్థతో ఉన్న సంబంధాలను కత్తిరించాలని హంగేరి, జర్మనీ దేశాలను జెలెన్‌స్కీ డిమాండ్ చేశారు.

కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

సైదాబాద్ , ఫిబ్రవరి 26: సైదాబాద్ మండల కార్యాలయం వద్ద శనివారం కల్యాణ లక్ష్మి చెక్కులను యాకుత్‌పురా నియోజకవర్గం ఎమ్మెల్యే పాషా ఖాద్రీ, ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి పథకం పేద ప్రజలకు వరంలాంటిదని, పేదప్రజలు తమ ఆడపిల్లల పెండ్లిలు చేయటానికి ఎంతగానో ఉపయోగడుతుందన్నారు.కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలని, ఎవరికైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి : సవ్యసాచి ఘోష్

హైదరాబాద్, ఫిబ్రవరి 26: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, తెలంగాణ రాష్ట్ర శిక్షణ ఉపాధి సంస్థ, సెట్విన్ సంస్థ సంయుక్తా ధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని యూత్ హాస్టల్‌లో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి సవ్యసాచి ఘోష్, డైరక్టర్ వాసం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ జాబ్‌మేళాను ప్రారంభించారు.

దేశంలో వైద్య విద్యకు వసతి కల్పించాలి : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:ఇండియాలో వైద్య విద్యకు సంబంధించిన మౌలిక వసతుల కల్పన పెద్ద ఎత్తున చేయాల్సి ఉందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఉక్రెయిన్ సంక్షోభం తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో ప్రైవేటు రంగంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వాలు మెడికల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేసుకోవాల్సి ఉందన్నారు. దేశంలో మనకు కావాల్సిన వైద్యులను మనమే తయారు చేసుకుందామన్నారు మోడీ. భారతీయ విద్యార్థులు భాషా సమస్యలున్నా ఎన్నో వ్యయప్ర యాసలకు ఓర్చి విదేశాలకు చదువుకునే ందుకు వెళ్తన్నారని ఇకపై వారు ఇండియాలోనే చదువుకునేలా ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు.

ఏపీలో కొత్తగా 141 మందికి కరోనా ..

అమరావతి, ఫిబ్రవరి 26: ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకూ కరోనా కేసులు తగ్గుముఖం పడుతున్నాయి. రాష్ట్రంలో 24 గంటల్లో 15,213 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా కొత్తగా 141 మంది కరోనా బారిన పడ్డారని, ముగ్గురు మృతి చెందారని ఏపీ వైద్యాధికారులు వెల్లడించారు. మరో 1,329 మంది బాధితులు కరోనా నుంచి కోలుకున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో 3,518 యాక్టివ్ కేసులు ఉన్నాయని వారు వివరించారు.

ఈ నెల 28న జొన్నబండ శివాలయంలో శివపార్వతుల కల్యాణం

అల్వాల్,ఫిబ్రవరి 26:: మహాశివరాత్రి ఈ సందర్భంగా ఓల్డ్ అల్వాల్ పరిధిలోని జొన్నబండ ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 28న పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం జరుగనున్నది. అదే రోజు సాయంత్రం పల్లకీసేవ, మరుసటి రోజు (మహాశివరాతి)న మహాకాల రుద్రాభిషేకం, ఏకబిల్వ అఖండ బిల్వ సహిత రుద్రాభిషేకం, బుధవారం రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొడారి నర్సింగరావు, పధానార్చకుడు విరివెంటి రాజశేఖర్ శర్మ వివరించారు.

చరిత్రలో నేటినిజం

కం॥ లోకుల కునుముల గెలుచెడి
మాకతి వవె రంజన సజి మైదానములో
బ్రాకులు అను దాలగించును
వారళ "సంభవ సింగ" పారి దళ్వాండ్లా !!
-రాధశ్రీ

(ఫిబ్రవరి 27 హాకీ ఆటగాడు సందీప్‌సింగు జననం...) సెల్: 9494481210

పుతిన్ మానసిక స్థితి బాగాలేదా?!

07 అక్టోబర్ 1952లో జన్మించిన 69-ఏండ్ల వ్లాదమిర్ పుతిన్, రష్యా అధ్యక్షుడిగా తన రాక్షస మనస్తత్వాన్ని పరిచయం చేస్తూ, నీరోలా నిరంకుశ ధోరణి ప్రదర్శిస్తూ, ఉక్రెయిన్‌పై అమానవీయ బాంబు దాడులకు ఉపక్రమిస్తున్నారు. 2012 నుంచి రెండవ పర్యాయం రష్యా అధ్యక్షుడిగా తనదైన అసాధారణ ముద్ర వేసిన పుతిన్ తిరుగులేని వ్యక్తిగా రాజ్యాంగబద్ధంగా అధ్యక్ష పదవిలో 2036 వరకు కొనసాగేలా చట్ట సవరణ కూడా చేశారు. 1975లో న్యాయశాస్త్ర డిగ్రీ పూర్తి చేసిన పుతిన్, కెజిబీ గూఢాచారిగా 16 ఏండ్లు ఉద్యోగం చేశారు. లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఉన్న పుతిన్ 1991లో ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1996లో నాటి అధ్యక్షుడు బోరిస్ యెట్సిన్ పరిపాలన విభాగంలో చేరారు. ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్‌లో డైరెక్టర్‌గా స్వల్పకాలం పని చేసి, సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శిగా సేవలను అందించారు. ఆగష్టు 1999లో రష్యా ప్రధానమంత్రిగా పని చేశారు. నాటి అధ్యక్షుడు బోరిస్ యెట్సిన్ రాజీనామాతో తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, 2004లో తిరిగి ఎన్నికైనారు. రెండు టర్ములు మాత్రమే అధ్యక్షుడిగా చట్టం అనుమతించటంతో నాటి అధ్యక్షుడు డిమిత్రీ మెద్వదేవ్ నేతృత్వంలో 2008-12 వరకు ప్రధానిగా పని చేశారు. 2012 నుంచి తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికై పని చేస్తూ 2018లో మరో టర్మ్ ఎన్నికై, అధికార దాహంతో చట్ట సవరణ చేసి మరో రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా 2036 వరకు కొనసాగడానికి మార్గం సుగమం చేసుకున్నారు. అధ్యక్షుడిగా పుతిన్ నేతృత్వంలో రష్యా ఆర్థిక ప్రగతిని, 72 శాతం కొనుగోలు సామర్థ్యాన్ని, 2.5 రెట్లు ఆదాయాన్ని, మూడు రెట్లు వేతనాలను పెంచుతూనే నిరుద్యోగం, పేదరికాన్ని 50 శాతానికి పైగా తగ్గించగలిగారు. రష్యా ఎగుమతి చేసే చమురు రేట్లు 5-రెట్లు పెరగడంతో దేశ ఆర్థికానికి ఊతం ఇవ్వగలిగారు. చెచెన్ రెండవ యుద్ధ విజయం, రూసో-జార్జియన్ యుద్ధ గెలుపు, మిలిటరీ/పోలీస్ చట్ట సవరణలను విజయవంతం చేయడంలో పుతిక్ క్రియాశీల పాత్ర అధికమని అంటారు. 2014లో ఉక్రెయిన్‌పై మిలటరీ దాడితో రష్యా ఆర్థికంగా వెనక్కి నెట్టబడింది. 2016 తరువాత దేశ ఆర్థిక స్థితిని మెరుగు పరచడం ప్రారంభించిన పుతిన్, కరోనా విజృంభనతో కొంత ప్రభావితం కావడం, 2022లో ఉక్రెయిన్‌పై ఏకపక్ష దాడితో రక్త చరిత్రకు పురుడు పోశారు. పుతిన్ నిరంకుశ ధోరణి, రాజకీయ శత్రువులను మట్టు పెట్టడం, పత్రిక స్వేచ్ఛను హరించడం, ఎన్నికల నియమాలను ఉల్లంఘించడం, ప్రజాస్వామ్యాన్ని పలుచబరచడం లాంటి దుశ్చర్యలకు పూనుకొని తన రాక్షస స్వభావాన్ని ప్రకటిస్తూ వచ్చారు. ప్రపంచ దేశాల జాబితాలో పారదర్శక పాలన, అవినీతి రహిత పాలన, ప్రజాస్వామ్య విలువలు, పత్రిక స్వేచ్ఛ లాంటి సూచికల్లో రష్యా దేశం చివరి వరుసలో నిలవటానికి పుతిన్ నిరంకుశ పాలనే కారణమైంది.

అకారణంగా ఉక్రెయిన్‌పై పాశవిక మిలటరీ దాడి చేసిన పుతిన్ క్రూర స్వభావాన్ని, తనలో దాగి ఉన్న అసుర మనసును తట్టి లేపి ప్రపంచ మానవాళి దృష్టిలో భయంకర ప్రతినాయకుడిగా నిలిచారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ప్రయోగించి, ఏకాకి ఉక్రెయిన్ నగరాలపై పాశవిక బాంబుల దాడులతో అమాయక ప్రజల ప్రాణాలను హరిస్తూ, మారణహోమాన్ని చూస్తూ రక్త పిపాసిలా ఆనందిస్తున్నారు. రోమ్ తగులబడుతున్న వేళ నీరో ఫిడేలు వాయించినట్లు పుతిన్ దుర్బుద్ధిని, భీకర రూపాన్ని పరిచయం చేస్తున్నారు. హిట్లర్‌ను తలపిస్తున్న పుతిన్ దూకుడుకు అడ్డుకట్ట వేయడానికి నాటో దేశాలతో పాటు ప్రధాన ఇతర ప్రపంచ దేశాలు కూడా సమన్వయంతో జవాబు చెప్పాల్సి ఉంది. ఉక్రెయిన్ పక్షాన యూయస్ నేతృత్వంలో నాటో దేశాలు రష్యాపై ఆంక్షలు విధించడం, సైబర్ దాడులకు/ఆంక్షలకు పూనుకోవడం ప్రారంభమైన వేళ, లక్షల మంది ఉక్రెయిన్ ప్రజలు ప్రాణాలను కాపాడుకోవడానికి రాజధాని కేవ్ నగరాన్ని వదిలి వెళ్ళడం, మిలియన్ల ఉక్రెనియన్లు తల దాచుకోవడానికి పోలాండ్, స్లొవేకియా, హంగెరీ, రొమానియా, మాల్డోవా లాంటి ఇతర పొరుగు సరిహద్దు దేశాలకు రైళ్లు, కార్లు, కాలి నడకలతో పెద్ద ఎత్తున పారిపోవడం జరుగుతోంది. ఉక్రెయిన్‌పై అన్ని వైపుల నుంచి భీకర దాడులు ప్రారంభించిన రష్యా బలగాలు, బాంబుల వర్షాలకు మిలియన్ల అమాయకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని దిక్కుతోచని స్థితిలో ఉండగా, వేల మంది సామాన్య జనులు కూడా మరణించి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. దిక్కుతోచని ప్రజలు ఇండ్లను వదిలి అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్లు, అందుబాటులో ఉన్న బంకర్లలో తల దాచుకుంటున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఇంత పెద్ద స్థాయిలో ఉక్రెయిన్‌పై రష్యా తలసేన, వాయుసేన, నావ సేన దాడులు జరగడం ఇదే మె?దట సారి అని వింటున్నాం. ఉక్రెయిన్‌ను నేల మట్టం చేసే వరకు పుతిన్ రాక్షసత్వం ఆగేలా లేదు. కేవ్, కర్కీవ్, సుమీ, లైవ్ లాంటి నగరాల జనావాసాలన్నీ శవాల దిబ్బలుగా మారాయని తెలుస్తున్నది. రష్యాకు ఎదురుగా ఉక్రెయిన్ పక్షాన ఏ దేశ మిలటరీ నిలబడి పోరాడే ప్రయత్నం చేసినా తాము అణుబాంబులు, అణ్వాయుధాలు ప్రయోగించడానికి కూడా వెనకాడమని పుతిన్ ప్రకటించడం, పిచ్చోడి చేతిలో రాయి చందాన, అమెరికా రష్యాల మధ్య 3వ ప్రపంచ అణు యుద్ధ భేరి మోగించినట్లుగా తోస్తున్నది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్‌లోని హిరోషిమ, నాగసాకీ నగరాలపై వేసిన అణు బాంబుల దాడికి 2 లక్షలకు పైగా ప్రజలు మరణించడం, మిలియన్లు తీవ్రంగా గాయపడడం మనకు తెలుసు. అల్లకల్లోల, భయంకరమైన, అలౌకిక, అమానవీయ, రాక్షస మనస్తత్వం కలిగిన పుతిన్ దుశ్చర్యలు ఏ రూపం దాల్చనున్నాయో మరి కొన్ని రోజులలో తేలనుంది. రష్యాకు బుద్ధి చెప్పడానికి అమెరికా నేతృత్వంలోని నాటో దేశాలు, ఇతర దేశాలు తొందరపడి ఎదురించే ప్రయత్నం చేస్తే మతి భ్రమించిన పుతిన్ ఏ భయంకర నిర్ణయమైన తీసుకోవచ్చని ఊహించాలి. నాటోలో సభ్యత్వం పొందమని, రష్యాతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఉక్రెయిన్ ప్రకటించడం కొంత ఊరటను ఇస్తున్నా, పుతిన్ ప్రతిస్పందన ఎలా ఉండనుందనే విషయం త్వరలోనే తేలనుంది. నాటో దేశాలు, ఐక్యరాజ్యసమితి లాంటి కూటములు ప్రేక్షక పాత్ర వహిస్తున్న వేళ ఉక్రెయిన్‌పై రష్యా దాడిని ఖండిస్తూ భద్రతామండలి శుక్రవారం 25 ఫిబ్రవరి 2022న చేసిన తీర్మానానికి అనుకూలంగా 11 దేశాలు, హాజరు కాకుండా తటస్థ వైఖరి పాటించిన భారత్, చైనా, యూఏఈలతో పాటు రష్యా వీటో పవర్‌తో తీర్మానం వీగి పోయింది. కరోనా విజృంభనతో పుతిన్ మతి భ్రమించిందని, మానసిక ఆందోళన, గందరగోళ దుస్థితిలో ఉన్న పుతిన్‌కు సద్బుద్ధి కలగాలని, తనలో మానవీయత జాగృతం కావాలని కోరుకుందాం. అవసరమైతే కుక్క కాటుకు చెప్పు దెబ్బ తీయడానికి ప్రపంచ దేశాలు సన్నద్ధం కావాలని ఆశిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

రైతుల ఇళ్లకు వెళ్లి పథకం పాలసీ అందజేస్తాం - కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద, ఈ పథకం యొక్క పత్రాలని మొదటిసారిగా రైతులకు అందజేయనున్నారు. ఇండోర్ నగరంలోని బుర్హి బర్లాయ్ గ్రామంలో జరిగే 'మేరీ పలిసి మేరే హాత్' కార్యక్రమంలో సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ చేతుల మీదుగా ఈ పాలసీని రైతులకు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కొంతమంది రైతులకు పంటల బీమా పాలసీ పంపిణీ చేయనున్నారు. ఎంపిక చేసిన రైతు ఉత్పత్తిదారుల సంస్థకి కూడా సర్టిఫికెట్లు పంపిణీ చేయబడతాయి. వేదిక వద్ద వ్యవసాయ శాఖ, ఇతర సంస్థలచే కృషి మేళా , ప్రదర్శన కూడా నిర్వహించబడుతుంది. ఈ జాతరలో రైతులకు.. డ్రోన్‌ల వినియోగంపై కూడా అవగాహన కల్పిస్తారు.

దీంతో పాటు సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ..కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తో జ్యోతి వెలిగించారు. ఆ తర్వాత కన్యాపూజ చేసి వేదికను కూడా ప్రారంభించారు. వేదికపైకి వచ్చిన ఆయనకు జలవనరుల శాఖ మంత్రి తులసీ సిలావత్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కమల్ పటేల్ కూడా పాల్గొన్నారు.పిఎం ఫసల్ బీమా యోజన సిఇఒ రితేష్ చౌహాన్ తన స్వాగత ప్రసంగంలో ఫసల్ బీమా యోజన గురించి సమాచారం ఇస్తూ, ఈ పథకం కోట్లాది మంది రైతులకు ఉపశమనం కలిగించిందని అన్నారు. ఆరేళ్ల క్రితం మధ్యప్రదేశ్ నుంచి ఈ పథకాన్ని ప్రారంభించారు. ఇప్పుడు రైతుల ఇళ్లకు వెళ్లి పథకం పాలసీని అందజేస్తారని చెప్పారు.

బీజేపీతో పొత్తు లేదన్న-బీఎస్పీ అధినేత్రి మాయావతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:బీజేపీతో పొత్తుపై వస్తున్న వార్తలను బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి కొట్టిపారేశారు. దీంతో బీజేపీ, బీ టీమ్ అనే ఊహాగానాలకు తెరపడింది. గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా బహుజన్ సమాజ్ పార్టీ ని ప్రశంసించారని, ఆ తర్వాత బిజెపిని మీడియాలో బిజెపి బి టీమ్‌గా అభివర్ణించారు. ఈ విషయంపై మాయావతి మాట్లాడుతూ ..ఇందులో వాస్తవం లేదన్నారు. సాక్షాత్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాయావతికి భూమిపై పట్టు ఉందని, అయితే అది సీటులో ఎంతవరకు మారుతుందో ఆమెకు తెలియదని అన్నారు. జాతవ్ , ముస్లిం ఓట్లు మాయావతికి పెద్ద సంఖ్యలో వెళ్లాయని కూడా షా చెప్పారు. షా ఈ ఇంటర్వ్యూ తర్వాత అవసరమైతే బీఎస్పీ.. బీజేపీతో కలిసి వెళ్లవచ్చని మీడియాలో ఊహాగానాలు వచ్చాయి. యూపీలో బీఎస్పీకి దళితులు, ముస్లింల ఓట్లు మాత్రమే కాకుండా ఇతర వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల ఓట్లు కూడా లభిస్తాయన్నారు.

విద్యార్థును తొందరగా వెనక్కి తీసుకురావాలి : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:ఉక్రెయిన్‌లోని భారతీయులు దుర్భర పరిస్థితిలో ఉన్నారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ ఇరుక్కుపోయిన భారతీయులను కేంద్రం వెంటనే సురక్షితంగా భారత్‌కు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఉక్రెయిన్‌లోని బంకర్‌లో ఉన్న కర్నాటక విద్యార్థులకు సంబంధించిన ఓ వీడియోను రాహుల్ ఈ సందర్భంగా పోస్ట్ చేశారు.

ఈ విజువల్స్‌లో ఉన్న భారతీయ విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. రష్యా టార్గెట్‌గా ఉన్న తూర్పు ఉక్రెయిన్‌లో చాలా మంది ఇరుక్కుపోయారు. మరో సారి కేంద్రాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. అక్కడ ఇరుక్కున భారతీయులు, భారతీయ విద్యార్థులను వెంటనే భారత్‌కు తీసుకుండి అంటూ రాహుల్ ట్వీట్ చేశారు.

భారతీయ విద్యార్థులతో ఎయిరిండియా విమానం ముంబైకి బయల్దేరిందని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ప్రకటించారు. ఇందులో 219 మంది విద్యార్థులున్నారని పేర్కొన్నారు. ఉక్రెయిన్ పరిస్థితులను తమ యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూనే వుందని, విద్యార్థులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జైశంకర్ తెలిపారు.

రూ.6.7 కోట్ల హెరాయిన్ స్వాధీనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో భారీగా హెరాయిన్ పట్టుబడింది. ఆ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలోని 7 ట్యాంక్స్ లేన్‌లో యాంటీ ఎఫ్ఐసీఎస్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో జార్ఖండ్‌కు చెందిన డ్రగ్ డీలర్ నుంచి భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. రూ. 6.7 కోట్ల విలువ చేసే 1.341 కిలోల హెరాయిన్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఈ డ్రగ్స్‌ను వాహనంలో దాచి ఉంచినట్లు పోలీసులు తెలిపారు. అయితే కోల్‌కతా పోలీసులు నిందితుడిని ఇవాళ కోర్టు ఎదుట హాజరు పరచనున్నట్లు తెలిపారు.

బయోమెడికల్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై ఐసిఎంఆర్/డిహెచ్‌ఆర్ పాలసీని ప్రారంభించిన డాక్టర్ మన్సుఖ్ మాండవియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:పోటీతత్వ గ్లోబల్ కాన్వాస్‌లో ఏదైనా దేశాన్ని వృద్ధి మరియు అభివృద్ధి వైపు నడిపించే ప్రాథమిక స్తంభాలుగా పరిశోధన మరియు ఆవిష్కరణలను గుర్తిస్తూ, డాక్టర్ మన్సుఖ్ మాండవియా, ఆరోగ్య రంగంలో పరిశోధన, వ్యవస్థాపకత మరియు వినూత్న కార్యక్రమాల ద్వారా భారతదేశం కూడా తన బలాన్ని మరియు సామర్థ్యాన్ని ప్రదర్శించాల్సిన సమయం ఇదని అన్నారు. వైద్య పరికరాలతో సహా. గౌరవనీయులైన ప్రధానమంత్రి నాయకత్వం మరియు మార్గదర్శకత్వంలో, భారతదేశం స్వావలంబన మరియు స్వీయ-పోషణ దిశగా అనేక ముఖ్యమైన చర్యలు తీసుకుంది, ముఖ్యంగా మహమ్మారి కాలంలో వ్యాక్సిన్ అభివృద్ధిలో చర్యలు చేపట్టింది. నేటి ఆవిష్కరణ కేంద్ర ప్రభుత్వ మేక్-ఇన్ ఇండియా, స్టార్ట్-అప్-ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న వైద్య సంస్థలలో బహుళ-అంశాల సహకారాన్ని, స్టార్ట్-అప్ సంస్కృతిని ప్రోత్సహిస్తుంది మరియు ఇన్నోవేషన్ లీడ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తుంది.

కేంద్ర మంత్రి మాట్లాడుతూ "డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, సాంకేతిక నిపుణులతో కూడిన మా మెడికల్ వర్క్‌ఫోర్స్ అత్యాధునిక స్థాయిలో ప్రాథమిక సమస్యలతో పనిచేసిన వారి అనుభవం ఆధారంగా ఎంతో జ్ఞానాన్ని కలిగి ఉంది. వారికి ఆవిష్కరణల ఆలోచనలు కూడా ఉన్నాయి. ఇప్పటి వరకు, ఇవి మరింత వృద్ధికి పాలసీ ఫ్రేమ్‌వర్క్ మరియు వేదికను పొందలేకపోయాయి. ఈ విధానం పరిశ్రమ, సాంకేతిక సంస్థలను అనుసంధానిస్తుంది మరియు ఆరోగ్య రంగంలో ఈ ఆలోచనలు మరియు ఆవిష్కరణల వాణిజ్య అనువాదాన్ని ప్రోత్సహిస్తుంది. మా సేవా భావ్ తత్వశాస్త్రం వైద్య నైపుణ్యం మరియు వ్యవస్థాపకతతో ముడిపడి ఉన్నప్పుడు, ఇది భారతదేశంలో ఒక శక్తివంతమైన పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేస్తుందని నేను విశ్వసిస్తున్నాను, ఇది మన పౌరులకు మాత్రమే కాకుండా సమాజానికి మరియు భారతదేశానికి మొత్తం ప్రయోజనం చేకూరుస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు.

ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ ఈ చొరవను ప్రశంసించారు. ముఖ్యమైన ఈ పాలసీ డాక్యుమెంట్‌ను తీసుకువచ్చినందుకు డిహెచ్‌ఆర్, ఐసిఎంఆర్‌ని అభినందించారు. "ఈ విధానం మెడికల్ కాలేజీలు/ఇన్‌స్టిట్యూట్‌లలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తుందని గట్టిగా నమ్ముతున్నట్టు చెప్పారు.

ఐసిఎంఆర్ సెక్రటరీ, డిహెచ్‌ఆర్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ బలరామ్ భార్గవ మాట్లాడుతూ వైద్య నిపుణుల కోసం బయోమెడికల్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై ఐసిఎంఆర్/డిహెచ్ ఆర్ విధానం ఒక మలుపని అన్నారు. ఇది మానవ-ఆరోగ్యం, శ్రేయస్సును సానుకూలంగా ప్రభావితం చేసే అంతిమ లక్ష్యంతో ఆవిష్కరణ మరియు వ్యవస్థాపక వెంచర్‌ల కోసం తమ సిబ్బందికి చురుకుగా మద్దతునిచ్చేలా వైద్య సంస్థలను అనుమతిస్తుందని తెలిపారు. "ఆవిష్కరణ, పేటెంట్, ఉత్పత్తి, అభివృద్ధి" అనే గౌరవనీయ ప్రధాన మంత్రి నినాదంతో ఇది ప్రతిధ్వనిస్తుంది, ఈ విధానం దేశంలోని ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకత సంస్కృతిలో ఒక సమూనా మార్పును తీసుకువస్తుందని డాక్టర్ బలరాం భార్గవ్ తెలిపారు.

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది 21వ శతాబ్దంలో వ్యవసాయం మరియు సాగుకు సంబంధించిన ధోరణిని పూర్తిగా మార్చివేయనుంది"

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:వ్యవసాయ రంగం లో కేంద్ర బడ్జెటు 2022 తీసుకు రాగల సకారాత్మక ప్రభావం అంశం పై ఏర్పాటైన ఒక వెబినార్ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. వ్యవసాయ రంగాన్ని పటిష్ట పరచడం కోసం బడ్జెటు తోడ్పాటు ను అందించగల మార్గాల ను గురించి ఆయన చర్చించారు. 'స్మార్ట్ ఎగ్రికల్చర్' - అమలు సంబంధి వ్యూహాలు అనే విషయం పై ఈ వెబినార్ లో దృష్టి పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమం లో సంబంధిత కేంద్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, పరిశ్రమ మరియు విద్య రంగాల ప్రతినిధుల తో పాటు వివిధ కృషి విజ్ఞాన కేంద్రాల మాధ్యమం ద్వారా రైతులు పాలుపంచుకొన్నారు.

పిఎమ్ కిసాన్ సమ్మాన్ నిధి ప్రారంభం అనంతరం మూడో వార్షికోత్సవం జరుపుకోవడాన్ని గురించి ప్రధాన మంత్రి తన ప్రసంగం మొదట్లో ప్రస్తావించారు. "ఈ పథకం ప్రస్తుతం దేశం లో చిన్న రైతుల కు ఒక బలమైన అండ గా నిలచింది. ఈ పథకం లో భాగం గా, 11 కోట్ల మంది రైతుల కు దాదాపు గా 1.75 లక్షల కోట్ల రూపాయల ను ఇవ్వడమైంది" అని ఆయన అన్నారు. విత్తనం నుంచి బజారు వరకు విస్తరించినటువంటి అనేక కొత్త వ్యవస్థల ను గురించి, మరి అలాగే వ్యవసాయ రంగం లో పాత వ్యవస్థల లో చోటు చేసుకొన్న సంస్కరణల ను గురించి ప్రధాన మంత్రి మాట్లాడారు. "కేవలం 6 సంవత్సరాల లో వ్యవసాయాని కి బడ్జెటు ను అనేక రెట్లు పెంచడమైంది. రైతుల కు వ్యవసాయ రుణాలు కూడా గత 7 సంవత్సరాల లో రెండున్నర రెట్ల మేరకు పెరిగాయి" అని ఆయన అన్నారు. మహమ్మారి తాలూకు కష్టకాలం లో ఒక ప్రత్యేక ఉద్యమం లో భాగం గా కిసాన్ క్రెడిట్ కార్డు (కెసిసి) లను 3 కోట్ల మంది రైతుల కు ఇవ్వడం జరిగింది. అంతే కాక పశుపోషణ, చేపల పెంపకం లలో నిమగ్నం అయిన రైతుల కు కూడా కెసిసి సదుపాయాన్ని వర్తింప జేయడమైంది. చిన్న రైతుల కు గొప్ప లబ్ధి ని చేకూర్చడం కోసం సూక్ష్మ సేద్యం సంబంధి నెట్ వర్క్ ను కూడా బలోపేతం చేయడం జరిగింది అని ఆయన అన్నారు.

ఈ ప్రయాసల తో రైతులు రికార్డు స్థాయి ఉత్పత్తి ని అందిస్తున్నారు. మరి ఎమ్ఎస్ పి కొనుగోళ్ళ లో సైతం కొత్త కొత్త రికార్డు లు నమోదు అయ్యాయి. సేంద్రియ వ్యవసాయాని కి ప్రోత్సాహం లభించినందువల్ల సేంద్రియ ఉత్పత్తు ల బజారు 11,000 కోట్ల రూపాయల స్థాయి కి చేరుకొంది. ఎగుమతులు 6 సంవత్సరాల కిందట 2000 కోట్ల రూపాయల వద్ద ఉండగా ప్రస్తుతం 7000 కోట్ల రూపాయల కు పై చిలుకు స్థాయి కి ఎగశాయి అని ప్రధాన మంత్రి అన్నారు.

వ్యవసాయాన్ని ఆధునికమైంది గా, స్మార్ట్ గా తీర్చిదిద్దడం కోసం బడ్జెటు లో ఏడు మార్గాల ను ప్రతిపాదించడం జరిగిందని ప్రధాన మంత్రి వివరించారు. వాటిలో ఒకటో మార్గం గంగా నది ఉభయ తీర ప్రాంతాల లో 5 కిలో మీటర్ ల పరిధి లో ప్రాకృతిక వ్యవసాయాన్ని ఉద్యమ తరహా లో చేపట్టాలి అనే లక్ష్యం. రెండో మార్గం వ్యవసాయం లో, తోట పంటల సాగు లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల కు అందుబాటు లోకి తీసుకు రావడం. మూడో మార్గం ఖాద్య తైలం దిగుమతి ని తగ్గించడం కోసం మిశన్ ఆయిల్ పామ్ ను బలపరచడానికి ప్రాధాన్యాన్ని కట్టబెట్టడం. నాలుగో మార్గం ఏది అంటే అది వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కోసం పిఎం గతి-శక్తి ప్రణాళిక మాధ్యమం ద్వారా సరికొత్త లాజిస్టిక్స్ సంబంధి ఏర్పాటులను చేయడం అనేదే. బడ్జెటు లో పేర్కొన్న అయిదో పరిష్కార మార్గం వ్యవసాయ వ్యర్థాల నిర్వహణ ను మెరుగైన పద్ధతి లో చేపట్టడమూ, వ్యర్థాల నుంచి శక్తి ఉత్పాదన ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడమూను. రైతు లు ఇకపై ఇబ్బందుల ను ఎదుర్కోబోకుండా ఒకటిన్నర లక్షల కు పై చిలుకు తపాలా కార్యాలయాలు బ్యాంకింగ్ వంటి సేవల ను సమకూర్చడం అనేది ఆరో మార్గం గా ఉంది. ఏడో మార్గం ఏది అంటే అది- వ్యవసాయ పరిశోధన, ఇంకా విద్య సంబంధి పాఠ్య క్రమాన్ని ఆధునిక కాలాల అవసరాల కు తగినట్లు మార్చడం జరుగుతుంది- అనేదే.

2023వ సంవత్సరాన్ని చిరుధాన్యాల అంతర్జాతీయ సంవత్సరం గా గుర్తిస్తున్న కారణం గా భారతీయ చిరుధాన్యాల బ్రాండింగ్ కు మరియు వాటి ప్రచారానికి గాను కార్పొరేట్ జగతి ముందడుగు ను వేయవలసిన అవసరం ఉంది అంటూ ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు. విదేశాల లోని ప్రధాన భారతీయ దౌత్య కార్యాలయాలు ఆయా దేశాల లో భారతదేశం చిరుధాన్యాల యొక్క నాణ్యత, భారతదేశం చిరుధాన్యాల యొక్క ప్రయోజనాలు ప్రజాదరణ కు నోచుకొనేటట్లు గా చర్చాసభల నిర్వహణ కు మరియు ఇతర ప్రోత్సాహక కార్యకలాపాల నిర్వహణ కు నడుం బిగించాలి అని కూడా ఆయన అన్నారు. పర్యావరణ అనుకూల జీవనశైలి విషయం లో చైతన్యం పెరుగుతూ ఉన్న పరిణామాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తత్ఫలితం గా ప్రాకృతిక ఉత్పత్తుల కు ఇంకా సేంద్రియ ఉత్పత్తుల కు ఏర్పడే బజారు ను వృద్ధి చేయాలని కూడా ప్రధాన మంత్రి సూచించారు. ప్రాకృతిక వ్యవసాయాని కి ప్రోత్సాహాన్ని ఇవ్వడం కోసం కెవికె లు తలా ఒక గ్రామాన్ని దత్తత చేసుకోవడం ద్వారా ముఖ్య భూమిక ను పోషించాలి అంటూ ఆయన ఉద్బోధించారు.

భారతదేశం లో భూమి పరీక్ష ల సంస్కృతి వృద్ధి చెందవలసిన అవసరం ఉంది అని శ్రీ నరేంద్ర మోదీ నొక్కిచెప్పారు. భూమి స్వస్థత కార్డు ల పట్ల ప్రభుత్వం తీసుకొంటున్న శ్రద్ధ ను గురించి ఆయన ప్రముఖం గా ప్రకటిస్తూ, నిర్ణీత కాలాంతరం తరువాత తప్పకుండా నేల ను పరీక్ష చేసే అభ్యాసాని కి మార్గాన్ని సుగమం చేయడం కోసం ముందుకు రావాలి అంటూ స్టార్ట్-అప్స్ కు పిలుపునిచ్చారు.

సేద్యపునీటి రంగం లో నూతన ఆవిష్కరణల పై ప్రధాన మంత్రి మాట్లాడుతూ, 'ప్రతి నీటి బిందువు కు, మరింత పంట' అనే అంశం పై ప్రభుత్వం తీసుకొంటున్న శ్రద్ధ ను గురించి వివరించారు. దీనిలో కూడా కార్పొరేట్ జగతి కి ఎన్నో అవకాశాలు ఉన్నాయి అని ఆయన అన్నారు. బుందేల్ ఖండ్ ప్రాంతం లోని కేన్-బేత్ వా లింక్ పథకం ఆవిష్కరించబోయే పరివర్తన ను గురించి కూడా ఆయన తన ప్రసంగం లో ప్రస్తావించారు. పెండింగు పడ్డ సేద్యపునీటి పథకాల ను త్వరిత గతి న పూర్తి చేయవలసిన అవసరాన్ని గురించి కూడా శ్రీ నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

ఆర్టిఫిశియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అనేది 21వ శతాబ్దం లో వ్యవసాయాని కి మరియు సాగు కు సంబంధించిన సరళి ని పూర్తి గా మార్చివేయబోతోంది అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. సాగు లో డ్రోన్ ల వినియోగం పెరుగుతూ ఉండటం అనేది ఈ మార్పు లో ఒక భాగం అని ఆయన అన్నారు. "మనం ఎగ్రి స్టార్ట్ - అప్స్ ను ప్రోత్సహించినప్పుడే డ్రోన్ సంబంధి సాంకేతిక పరిజ్ఞానం పెద్ద ఎత్తున అందుబాటు లోకి వస్తుంది. గత మూడు నాలుగు సంవత్సరాల లో దేశం లో 700కు పైచిలుకు ఎగ్రి స్టార్ట్-అప్స్ ఉనికి లోకి వచ్చాయి" అని ఆయన అన్నారు.

పంట కోత ల అనంతర కాలం లో నిర్వహణ సంబంధి పనుల గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ ప్రాసెస్ చేసిన ఆహారం యొక్క పరిధి ని పెంచడం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ విషయం లో నాణ్యత పరం గా అంతర్జాతీయ ప్రమాణాల కు పూచీ పడుతోందన్నారు. "ఈ అంశం లో కిసాన్ సంపద యోజన తో పాటుగా పిఎల్ఐ స్కీము ముఖ్యమైంది. వేల్యూ చైన్ కూడా ఇందులో ఒక ప్రధానమైనటువంటి పాత్ర ను పోషిస్తుంది. ఈ కారణం గా ఒక లక్ష కోట్ల రూపాయల తో ఒక ప్రత్యేకమైనటువంటి ఎగ్రికల్చర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండు ను ఏర్పాటు చేయడం జరిగింది'' అని ప్రధాన మంత్రి ప్రస్తావించారు.

పంట కోత ల శేషం సంబంధి నిర్వహణ అంశాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించారు. "

పోస్ట్ ఆఫీస్‌లలో 100 శాతం కోర్ బ్యాంకింగ్ వ్యవస్థను నిర్ధారించడానికి వ్యూహం అమలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:"ప్రతీ పౌరునికి చేరువకావడం" అనే అంశంపై బడ్జెట్ అనంతరం వెబ్‌నార్‌లో చర్చ నిర్వహించబడింది. కోర్ బ్యాంకింగ్ వ్యవస్థను.. 100 శాతం పోస్టాఫీసులలో ఇంటర్‌ఆపరబుల్ పోస్టాఫీసు ఖాతా పరిధిలోనికి తీసుకురావడానికి సంబంధించిన బడ్జెట్లో చేసిన ప్రకటన మరియు గ్రామీణ పేదలు ముఖ్యంగా మహిళల జీవితాలపై దాని ప్రభావం గురించి ఇందులో చర్చించబడింది. భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వెబ్‌నార్ ప్రారంభంలో ప్రసంగించారు. "ఎనీటైమ్ ఎనీవేర్ బ్యాంకింగ్ సర్వీసెస్ అండ్ ఇంటరాపరబుల్ సర్వీసెస్ త్రూ ఇండియా పోస్ట్" అనే అంశంపై "గ్రామీణ పేదలందరికీ ప్రత్యేకించి మహిళలకు తగిన జీవన ఉపాధి ఎంపికలు మరియు ఆర్థిక సేవలను పొందేలా హామీ ఇవ్వడంష అనే అంశంపై కేంద్ర గ్రామీణ అభివృద్ధి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో నీతి ఆయోగ్ మరియు ఇతర ఏజెన్సీల నుండి నిపుణులు మరియు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి పోస్టాఫీసు స్కీమ్‌లతో సంబంధం ఉన్న పెద్ద సంఖ్యలో ప్రజలు మరియు వాటాదారులు దీనికి హాజరయ్యారు. పోస్టాఫీసు ఖాతాల కోసం ఇంటర్‌ఆపరబుల్ సర్వీస్‌ను అమలు చేయడంతోపాటు 100 శాతం కోర్ బ్యాంకింగ్ వ్యవస్థను నిర్ధారించే అమలు వ్యూహంపై కూడా విస్తృత చర్చ జరిగింది. కేంద్ర

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక మరియు బ్యాంకింగ్ సేవలను అందించడానికి పోస్టల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించడం యొక్క అవకాశాలను అన్వేషించే మార్గాల విషయమై కూడా ఈ చర్చలో పాల్గొనేవారు చర్చించారు. నీతి ఆయోగ్ నుండి విశిష్ట నిపుణుడు శ్రీ అజిత్ పాయ్, క్రెడిట్, ఆర్థిక అక్షరాస్యత మరియు ఆర్థిక చేరిక యొక్క మొత్తం సాధనలో పోస్టాఫీసు గణనీయమైన పాత్ర పోషిస్తుందని నొక్కి చెప్పారు. వెబ్‌నార్‌లో చర్చ నుండి ఉద్భవించే కార్యాచరణ అంశాలను సకాలంలో తగిన విధంగా అమలు చేయడానికి డిపార్ట్‌మెంట్ వివరాలతో కూడిన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తుంది.

రెండు చుక్కలతో పోలియో రహిత సమాజం: మేయర్

అమరావతి, ఫిబ్రవరి 26:రెండు చుక్కలతో పోలియే రహిత సమాజంగా తీర్చదిద్దొచ్చని కర్నూలు నగర మేయర్ బి.వై. రామయ్య పేర్కొన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా చిన్నారులకు వేయనున్న పోలియో చుక్కలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకీ మేయర్ తో పాటు జాయింట్ కలెక్టర్ మనజిర్ జిలానీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిండు జీవితాన్ని కేవలం రెండు చుక్కలతో కాపాడుకోవచ్చని అన్నారు. రేపు జిల్లాలో జరిగే పోలియే కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు.

సర్కారు ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్య సేవలు: మంత్రి కొప్పుల

కరీంనగర్ ఫిబ్రవరి 26: (నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్య సేవలు అందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శనివారం జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో 8.90 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 50 పడకల మాతా శిశు ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మీరు పేదల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. తల్లీ బిడ్డల సంక్షేమం కోసమే ఈ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్టు తెలిపారు. మాతా శిశు ఆసుపత్రిలో వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయనీ, ధర్మపురి తో పాటుగా చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

భారీగా విరిగిపడిన కొండ చరియలు-జమ్మూ-శ్రీనగర్ హైవేపై రాకపోకల నిలిపివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 26:కొండచరియలు విరిగిపడటంతో జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను మూసివేశారు. కేంద్ర పాలిత ప్రాంతంలోని పలు చోట్ల వర్షం, నవయుగ సొరంగం చుట్టూ మంచు కారణంగా కొండచరియలు విరిగిపడి జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేసినట్లు అధికారులుతెలిపారు.కొండచరియలు విరిగిపడటంతో జాతీయ రహదారిపై అడ్డంకులు ఏర్పడినట్లు జమ్మూ, కాశ్మీర్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. దీంతో వాహనాల రాకపోకలకు హైవేను మూసివేయాల్సి వచ్చింది. ఎన్‌హెచ్‌డబ్ల్యూపై పలు చోట్ల కొండచరియలు విరిగిపడటం వల్ల పెద్ద పెద్ద రాతి బండలు రహదరిపై పడ్డాయి.

జమ్మూ కాశ్మీర్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలకు కలిపే ఏకైక జాతీయ రహదారి ఖాజీగుండ్-జమ్మూ-శ్రీనగర్ రహదారి. హైవేపై వివిధ చోట్ల కొండచరియలు విరిగిపడటం, పర్వతాల నుండి రాతి శకలాలు పడటం వల్ల హైవేని మూసివేశారు. హైవేలోని బనిహాల్-ఖాజిగుండ్ సెక్టార్‌లో రాత్రంతా భారీగా మంచు కురుస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాంబన్ జిల్లాలోని రొంపాడి-బనిహాల్, షాల్‌ఘర్-వాగన్, మౌంపాసి-రామ్‌సౌ, పాంటియల్, డిగ్‌డోల్, మరుగ్, మంకీ మోడ్, కెఫెటేరియా బెండ్ ,మహర్‌లలో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడుతున్నాయి.

అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, ఫిబ్రవరి 26:మహేశ్వరం నియోజకవర్గంలోని జల్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి శ్రీకారం చుట్టారు. డ్రైనేజ్, సీసీ రోడ్డు నిర్మాణాలకు, మంచినీటి పైప్ లైన్ పనులకు సంబంధించి శంకుస్థాపన చేసారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

పి.ఎం. కిసాన్ పథకం తృతీయ వార్షికోత్సవాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:ఎం- కిసాన్ పథకం కేంద్ర ప్రభుత్వ పథకం. దీనిని 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించారు. భూమి కలిగిన రైతుల ఆర్థిక అవసరాలకు ఆసరాగా ఉండేందుకు ఈ పథకాన్ని తీసుకువచ్చారు. సంవత్సరానికి 6 వేల రూపాయలు వంతున రైతులకు ఈ పథకం కింద ప్రయోజనం చేకూరుతుంది. దీనిని మూడు సమాన వాయిదాలలో రైతుల బ్యాంకు ఖాతాలలో ప్రత్యక్ష నగదు బదిలీ కింద ప్రతి నాలుగు నెలలకు ఒక సారి జమచేస్తారు. ఈ పథకాన్ని తొలుత చిన్న , సన్నకారు రైతులకు అంటే 2 హెక్టార్ల వరకు భూమి కలిగిన రైతులకు వర్తింప చేశారు. ఆత ర్వాత దీని పరిధిని 01.06.2019 నుంచి భూమి కలిగిన రైతులందరికీ వర్తింపచేశారు.

ఈ పథకం ప్రారంభించిన తరువాత పలు సాంకేతిక, ప్రాసెస్ ఆధునీకరణలు చోటుచేసుకున్నాయి. దీనివల్ల ఎక్కువమంది లబ్ధిదారులు వీలైనంత సమర్ధంగా ఈ పథకం వల్ల ప్రయోజనం పొందడానికి వీలు కలుగుతుంది.

2022 ఫిబ్రవరి నాటికి ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద 11.78 కోట్ల మంది భూమి కలిగిన రైతులకు సుమారు 1.82 లక్షల కోట్ల రూపాయలను పలు వాయిదాలలో దేశవ్యాప్తంగా గల అర్హులైన లబ్ధిదారులకు విడుదల చేయడం జరిగింది. ఇందులో 1.29 లక్షల కోట్ల రూపాయలను ప్రస్తుత కోవిడ్ 19 మహమ్మారి సమయంలో విడుదల చేయడం జరిగింది.

స్వీయ నమోదు ప్రక్రియ: లబ్ధిదారుల స్వీయ నమోదు ప్రక్రియను సులభతరం చేశారు. మొబైల్ యాప్ , పిఎం కిసాన్ పోర్టల్, కామన్ సర్వీసు సెంటర్లకు వెళ్లి పేరు సులభంగా నమోదు చేసుకునే వీలు కల్పించారు. లబ్ధిదారులకు గరిష్ఠ ప్రయోజనం కలిగించేందుకు ఈ ఏర్పాట్లు చేశారు.

రికవరీ సైతం సులభతరంః అర్హత లేని లబ్ధిదారుల విషయంలో వారి ఖాతాలో జమ అయిన మొత్తాన్ని వెనక్కు తీసుకునే ప్రక్రియ కూడా పారదర్శకంగా, సులభతరంగా ఉండేట్టు చూశారు. ఇందుకు డిమాండ్ డ్రాఫ్ట్ కానీ లేదా వ్యక్తిగతంగా చెక్కు సమర్పించాల్సిన అవసరం లేదు. రాష్ట్ర నోడల్ అధికారి ఖాతానుంచి కేంద్ర ప్రభుత్వ ఖాతాలోకి ఆటో ట్రాన్స్ ఫర్ అయ్యేలా చూశారు. దీనితో ఈ పథకం సమర్ధంగా పనిచేయడమే కాక తక్కువ సమయంలో పనులు పూర్తి చేసేదిగా ఉంది..

ఫిర్యాదుల పరిష్కారం, హెల్ప్ డెస్క్ః

లబ్ధిదారులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి సమగ్ర వివాద పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర స్థాయినలో పి.ఎం. కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద కేంద్ర ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటుతోపాటు పలు చర్యలు తీసుకున్నారు. దీనిద్వారా ఈ పథకం కింద భాగస్వామ్య పక్షాలను సమన్వయం చేసుకుని , ఈ ప్రక్రియను గాడిలో పెడతారు. కేంద్ర స్థాయిలో ఒక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ లేదా ఈ పథకానికి సంబంధించి లబ్ధిదారులకు గల సమస్యలు పరిష్కరించేందుకు ఇది పనిచేస్తుంది. దీనిఇద్వారా 11.34 లక్షల ఫిర్యాదులు రైతులు నుంచి స్వీకరించారు ఇందులో 10.92 లక్షల ఫిర్యాదులను ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం పరిష్కరించింది.

భౌతిక పరిశీలన పద్ధతి : ఈ పథకం లబ్ధిదారుల కచ్చితత్వం, అర్హతలను పరిశీలించేందుకు ప్రతి సంవత్సరం లబ్ధదారులలో 5 శాతంమంది వివరాలను భౌతికంగా పరిశీలించాలని ఈ పథకం నిబంధనలు తెలియజేస్తున్నాయి. భౌతిక వెరిఫికేషన్ నమూనా సహాయంతో , భౌతిక పరిశీలనకు ఎంపిక చేసే లబ్ధిదారుల జాబితాను ఆటోమేటిక్ విధానంలో ఎంపిక చేస్తున్నారు. ఇందుకు వ్యక్తిగత జోక్యం ఏదీ ఉండదు.10 శాతం లబ్ధిదారుల వాలిడేషన్‌కు సంబంధించి 2021 మే 14న చివరి త్రైమాసిక వాయిదా చెల్లింపు అనంతరం ప్రత్యేక మాడ్యూల్ ను ప్రవేశపెట్టారు.

ఆదాయ పన్ను పరిశీలన:

ఈ పథకం కింద లబ్ధిదారుల సమాచారాన్ని ఆదాయపన్ను సమాచారంతో సరిచూస్తారు. ఆడిట్‌తో కూడిన అధీకృత సమాచారంతో దీనిని పరిశీలిస్తారు.

ఆధార్ సమాచారంతో పరిశీలన : ఈ పథకం మొత్తం పారదర్శకంగా ఉండేందుకు ఆధార్ సమాచారంతో సరిచూడడాన్ని తప్పనిసరి చేశారు. ప్రస్తుతం ఈ పథకానికి సంబంధించి 11.20 కోట్ల మంది లబ్ధిదారుల సమాచారాన్ని ఆధార్ తో అనుసంధానం చేశారు.

చారిత్రక సమస్యలకు ప్రాధాన్యత: కర్నూల్ మేయర్

అమరావతి, ఫిబ్రవరి 26:కర్నూలు నగరంలోని దశాబ్దాల నుంచి పేర్కొపోయిన చారిత్రక సమస్యలకు ప్రాధాన్యం ఇస్తున్నామని కర్నూలు నగర మేయర్ రామయ్య అన్నారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న 19వ వార్డులో జోహరపురం రోడ్డున ఉన్న పాత డంప్ యార్డులో 8.05 కోట్లతో చెత్త రిసైక్లింగ్ ప్రక్రియ, 75 లక్షల వ్యయంతో నిర్మించిన బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అలాగే సోమిశెట్టి నగర్లో 16 లక్షల వ్యయంతో సిసి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మేయర్ బి.వై. రామయ్య మాట్లాడుతూ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో పరుగులు పెట్టించాలనే ఉద్దేశంతోనే నగర సుందరీకరణ, క్లిన్ అండ్ గ్రీన్ సిటీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నుంకేసుల జలాశయం నుంచి మునగాలపాడు సమీపంలో ఉన్న ఎస్.ఎస్. ట్యాంక్ వరకు పైప్ లైన్ నిర్మాణం చేస్తామన్నారు. నగర పాలక సంస్థ నూతన శాశ్వత భవనానికి త్వరలోనే రాష్ట్ర మంత్రులతో అట్టహాసంగా శంకుస్థాపనలు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాలను ప్రోత్సాహిస్తుందని అందులో భాగంగా ఎన్నో స్టేడియంల నిర్మాణాలు, టోర్నమెంట్లు చేపడుతుందన్నారు. జోహరపురం రోడ్డుకు దశాబ్దాల నుంచి ఉన్నా డంప్ యార్డును రూ.8,06 కోట్లతో సైన్టిఫిక్ పద్ధతిలో 1.50 లక్షల టన్నుల వ్యర్థాలను రిసైక్లింగ్ చేస్తున్నామని, రోజు 800 నుంచి 1000 టన్నుల చొప్పున 6 నెలలలోపు రిసైక్లింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.ఫలితంగా ఖాళీ 28 ఎకరాలను ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తామన్నారు.

చిరుధాన్యాలకు పూర్వ వైభవం తీసుకురావడం ద్వారా ఆహార, పోషకాహార, ఆర్థిక రంగాలలో స్వయం సమృద్ధి సాధించవచ్చు- శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:దేశంలో చిరుధాన్యాల ఉత్పత్తికి ప్రోత్సాహం, ప్రాధాన్యత ఇస్తున్నామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీజౌళి, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అన్నారు. దేశంలో యోగా తరహాలో చిరుధాన్యాలకు గుర్తింపు రావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. " చిరుధాన్యాలకు పూర్వ వైభవం తీసుకురావడం ద్వారా ఆహార, పోషకాహార, ఆర్థిక రంగాలలో స్వయం సమృద్ధి సాధించవచ్చును" అని శ్రీ గోయల్ వ్యాఖ్యానించారు.

వ్యవసాయ రంగానికి కేంద్ర బడ్జెట్ 2022 లో కల్పించిన అంశాలను వివరించేందుకు ఏర్పాటు చేసిన వెబినార్ లో ప్రధామంత్రి శ్రీ నరేంద్ర మోదీ తరువాత శ్రీ గోయల్ ప్రసంగించారు. " ఆకర్షణీయ వ్యవసాయం : చిరుధాన్యాలకు పూర్వ వైభవం: వంటనూనెలు రంగంలో స్వయం సమృద్ధి" అనే అంశంపై వెబినార్ లో శ్రీ గోయల్ మాట్లాడారు. చిరుధాన్యాల ఎగుమతుల రంగంలో భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా చేయవచ్చునని శ్రీ గోయల్ అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు నాలుగు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. "1. చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇస్తూ పంటల వైవిధ్యీకరణ కోసం కర్నాటక అమలు చేసిన పళ్ళ పెంపకం విధానాన్ని రాష్ట్రాలు అమలు చేయాలి. 2. నాణ్యమైన చిరుధాన్యాల సాగుకు అవసరమైన సాంకేతిక సహకారం పొందేందుకు వ్యవసాయ అంకుర సంస్థల సహకారం తీసుకోవాలి. 3.చిరుధాన్యాల వల్ల లభించే పోషక విలువలు, ఇతర ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలి. 4. భారత చిరుధాన్యాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకుని రావాలి" అని శ్రీ గోయల్ తన ప్రసంగంలో వివరించారు.

భారతదేశంలో తొమ్మిది రకాల చిరుధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయని శ్రీ గోయల్ అన్నారు. ప్రపంచంలో చిరుధాన్యాలను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న దేశాల జాబితాలో భారతదేశం రెండవ స్థానంలో ఉందని అన్నారు. అదేవిధంగా చిరుధాన్యాల ఎగుమతుల్లో కూడా భారత్ ప్రపంచంలో రెండవ స్థానంలో ఉందని మంత్రి వివరించారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని శ్రీ గోయల్ తెలిపారు. కనీస మద్దతు ధర చెల్లించి రైతుల నుంచి ప్రభుత్వం ఆహారధాన్యాలను సేకరిస్తున్నదని అన్నారు. దీనివల్ల 2021-22 ఖరీఫ్ పంట కాలంలో 64 లక్షల మంది రైతులు, 2021-22 రబీ పంట కాలంలో దాదాపు 48 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందారని అన్నారు.

పది రాష్ట్రాల్లోని 100 జిల్లాల్లో వరి సాగులో ఉన్న నాలుగు లక్షల హెక్టార్ల భూమిని నూనె గింజల సాగులోకి తీసుకు రావాలని నిర్ణయించామని శ్రీ గోయల్ తెలిపారు. నూనె గింజల దిగుబడి 230 జిల్లాల్లో ఎక్కువగా ఉందని గుర్తించామని వివరించారు. రానున్న అయిదు సంవత్సరాల్లో 20 లక్షల హెక్టార్ల భూమిలో అంతర పంటగా నూనెగింజల సాగు చేపట్టాలని నిర్ణయించామని మంత్రి అన్నారు.

'అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలన్న లక్ష్యంతో భారతదేశం పనిచేస్తోంది. దీనిలో భాగంలో ప్రతి రైతు స్వావలంబన సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం" అని శ్రీ గోయల్ ప్రకటించారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి సాంకేతిక అంశాలతో వ్యవసాయాన్ని ఆకర్షణీయ రంగంగా అభివృద్ధి చేస్తామని శ్రీ గోయల్ అన్నారు.

వ్యవసాయ పరిశోధన , విద్య విభాగం కార్యదర్శి మరియు భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్. టి . మహపాత్ర మాట్లాడుతూ,2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని అన్నారు. కోతల తరువాత విలువ జోడింపు, దేశీయ వినియోగాన్ని పెంపొందించడం మరియు జాతీయంగా మరియు అంతర్జాతీయంగాచిరుధాన్యాల ఉత్పత్తులను బ్రాండింగ్ చేయడం కోసం సహకారం అందిస్తామని ఆయన అన్నారు.

దేశంలోని నాలుగు లక్షల సాధారణ సేవా కేంద్రాలలో స్పర్శ్ కింద పెన్షన్ సేవలను అందించడానికి అవగాహన ఒప్పందంపై సంతకం చేసిన రక్షణ మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:దేశవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా కామన్ సర్వీస్ సెంటర్ల (సిఎస్ సి) లో సిస్టమ్ ఫర్ పెన్షన్ అడ్మినిస్ట్రేషన్ (రక్ష) టఎస్ పిఎఆర్ ఎస్ హెచ్ ఊ కింద పెన్షన్ సేవలను అందించడానికి ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కు చెందిన ప్రత్యేక ప్రయోజన విభాగం(ఎస్ పివి) అయిన సి ఎస్ సి ఇ-గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ తో రక్షణ మంత్రిత్వ శాఖ (డిఎడి) ఒక అవగాహన ఒప్పందం పై ఎమ్ఒ యుపై సంతకం చేసింది.

ఈ ఎమ్ఒయుపై కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ (సిడిఎ) -పెన్షన్లు శ్రీ షామ్ దేవ్ , సిఎస్ సి ఇ-గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సిఇఒ శ్రీ సంజయ్ కువార్ రాకేష్ ఫిబ్రవరి 24, 2022న న్యూఢిల్లీలో రక్షణ శాఖ కార్యదర్శి డాక్టర్ అజయ్ కుమార్ సమక్షంలో సంతకం చేశారు.

ఈ ఎమ్ఒయు పెన్షనర్ లకు, ప్రత్యేకంగా దేశంలోని మారుమూల ప్రాంతాలలో నివసించే వారికి, ఎస్ పి ఎఆర్ ఎస్ హెచ్ (స్పర్శ్) కు లాగిన్ అయ్యే మార్గాలు లేదా సాంకేతికత లేని వారికి చివరి మార్గ అనుసంధానాన్ని కల్పిస్తుంది.ఈ పెన్షనర్ ల కోసం సర్వీస్ సెంటర్లు ఎస్ పిఎఆర్ ఎస్ హెచ్ కోసం ఇంటర్ ఫేస్ గా మారతాయి. ప్రొఫైల్ అప్ డేట్ అభ్యర్థనలను నిర్వహించడానికి, ఫిర్యాదులను నమోదు చేయడానికి , పరిష్కార, డిజిటల్ వార్షిక గుర్తింపు, పెన్షనర్ డేటా వెరిఫికేషన్ లేదా వారి నెలవారీ పెన్షన్ కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందడానికి పెన్షనర్ లకు సమర్థవంతమైన మాధ్యమాన్ని అందిస్తాయి.

కోటక్ మహీంద్రా బ్యాంక్ తో కూడా ఒక ఎమ్ఒయు పై సంతకాలు జరిగాయి, దీని కింద ఆ బ్యాంక్ మాజీ సైనికులు ఎక్కువ మంది ఉన్న ప్రాంతాల లోని 14శాఖలలో సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఈ కేంద్రాలు ప్రస్తుతం ఉన్న 161 కి పైగా డిఎడి కార్యాలయాలు , దాదాపు 800 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ బిఐ) పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్ బి) శాఖల నెట్ వర్క్ ను మరింత పెంచుతాయి, ఇవి పెన్షనర్లు స్పర్శ్ ను ఉపయోగించడంలో సహాయపడటానికి, పని సులభతరం చేయడానికి సేవా కేంద్రాలుగా వ్యవహరిస్తున్నాయి. ఈ కేంద్రాల సేవలను పింఛను దారులకు ఉచితంగా అందిస్తారు, నామ మాత్రపు సర్వీసు ఛార్జీలను డిపార్ట్ మెంట్ భరిస్తుంది.

స్పర్శ్ చొరవ ద్వారా పెన్షన్ వ్యవహారాల నిర్వహణ లో సమర్థత, ప్రతిస్పందన పారదర్శకతను కల్పించినందుకు రక్షణ కార్యదర్శి సిజిడిఎను ప్రశంసించారు, ఈ ఎమ్ఒయు జీవన సౌలభ్యాన్ని ప్రోత్సహిస్తుందని , పెన్షన్ సంబంధిత సమస్యలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరిస్తుందని తెలిపారు. సిఎస్ సితో భాగస్వామ్యం దేశంలోని సుదూర మూలలకు డిజిటల్ గా పెన్షన్ సేవలను అందిస్తుందని, సాంకేతిక లేదా భౌగోళిక ఇబ్బందుల కారణంగా ఏ పింఛనుదారుడు కూడా తమ సరైన ప్రయోజనాలను కోల్పోకుండా చూస్తుందని ఆయన అన్నారు.

కార్యదర్శి (మాజీ సైనికోద్యోగుల సంక్షేమం) శ్రీ బి ఆనంద్ , ఆర్థిక సలహాదారు (రక్షణ సేవలు) శ్రీ సంజీవ్ మిట్ట ల్ , కంట్రోల ర్ జనరల్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ (సిజిడిఎ) శ్రీ రజనీష్ కుమార్ , రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డిజిటల్ ఇండియా', 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ (డిబిటి)' 'కనీస ప్రభుత్వం, గరిష్ట పాలన' అనే ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా రక్షణ శాఖ పెన్షనర్లకు పెన్షన్ సంబంధిత సమస్యలకు సమగ్ర పరిష్కారాన్ని అందించడమే లక్ష్యంగా రక్షణ మంత్రిత్వ శాఖ స్పర్శ్ చొరవకు శ్రీకారం చుట్టింది. ఈ వ్యవస్థను ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ (పెన్షన్స్), ప్రయాగ్ రాజ్ ద్వారా డిఎడి నిర్వహిస్తుంది. మూడు సర్వీసులకు, ఇంకా అనుబంధ సంస్థకు ఇది సేవలందిస్తుంది. ప్రారంభంలో ఈ వ్యవస్థ కొత్తగా పదవీ విరమణ చేసిన వారికి సేవ లందించింది. తరువాత క్రమంగా ప్రస్తుత రక్షణ పెన్షనర్లను అందరికీ సేవలందించేలా విస్తృతమయింది. ఈ వ్యవస్థ పెన్షన్ పరిశీలన, మంజూరు, బట్వాడా , సవరణ మొదలైన పెన్షన్ సైకిల్ అన్ని దశల వ్యవహారాలను నిర్వహిస్తుంది.

రక్షణ పెన్షనర్లను కేంద్ర స్థానం లో.ఉంచే విధంగా ఎస్ పి ఎ ఆర్ ఎస్ హెచ్ ను రూపొందించారు.వారికి తమ పెన్షన్ ఖాతాపై ఆన్ లైన్ పోర్టల్ (స్త్రబిబిజూబ:// బజూజీతీబష్ట.టవటవని ఇవజూవనిబతి నీని.ణనీల.తిని/) ద్వారా పూర్తి పారదర్శకమైన దృక్పథం కల్పిస్తారు.ఇది పెన్షన్ ఇచ్చింది మొదలుకొని చివరి అర్హత కలిగిన లబ్దిదారు అనంతరం పెన్షన్ నిలిపివేసే వరకు పింఛనుదారుని పూర్తి వివరాలతో రికార్డును నిర్వహిస్తుంది -

పెన్షన్ పేమెంట్ ఆర్డర్ల (పిపిఒలు) విధానం నుంచి పెన్షన్ ల డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ వరకు, సరైన సమయంలో సరైన పెన్షన్ అందించాలనే నినాదంతో పెన్షన్ బట్వాడా ప్రక్రియను స్పార్శ్ ప్రాథమికంగా తిరిగి రూపొందించింది.43,370 మంది పెన్షనర్లకు కేవలం 30 రోజుల్లోగా రూ.196 కోట్లకు పైగా అదనపు గ్రాట్యుటీని విడుదల చేయడం ఎస్ పిఎఆర్ ఎస్ హెచ్ సమర్థతకు ఇటీవలి ఉదాహరణ, పాత పద్ధతి లో అయితే ఈ ప్రక్రియకు ఆరు నెలల సుదీర్ఘ సమయం పడుతుంది.

కోల్ ఇండియా అటువంటి 100 కంటే ఎక్కువ గనులను ప్రైవేట్ రంగానికి అందించడానికి పరిశీలన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) తగిన సమయంలో రెవెన్యూ షేరింగ్ ప్రాతిపదికన ప్రైవేట్ రంగానికి మరియు ఇటువంటి 100 కంటే ఎక్కువ గనులను అందించాలని చూస్తోంది. సీఐఎల్ నిలిపివేయబడిన/మూసివేయబడిన గనుల కోసం ఆదాయ భాగస్వామ్య నమూనాపై బొగ్గు మంత్రిత్వ శాఖ.. ఈ రోజు న్యూఢిల్లీలో ప్రైవేట్ రంగంతో ఒక వాటాదారుల సంప్రదింపులను నిర్వహించింది. ప్రభుత్వ జరిపిన సంప్రదింపుల్లో ఎస్సెల్ మైనింగ్, అదానీ, టాటా, జేఎస్‌డబ్ల్యు, జేఎస్‌పీఎల్ మొదలైన ప్రైవేట్ రంగం నుండి భారీ భాగస్వామ్యాన్ని ఆకర్షించాయి. ఈ సంప్రదింపుల ప్రతిపాదనకు ఉత్సాహభరితమైన మద్దతునిచ్చాయి. నిలిపివేయబడిన/మూసివేయబడిన గనుల నుండి బొగ్గును ఉత్పత్తి చేయడానికి రెవెన్యూ షేరింగ్ మోడల్‌లో ప్రైవేట్ రంగాన్ని భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. అనేక కారణాల వల్ల సీఐఎల్ ద్వారా గతంలో నిలిపివేయబడిన/మూసివేయబడిన వివిధ గనులు ఉన్నాయి. వీటిని ప్రైవేట్ రంగం భాగస్వామ్యంతో తిరిగి తెరవవచ్చు మరియు ఉత్పాదకంగా అమలులోకి తీసుకురావచ్చు. ప్రైవేట్ రంగం సహకారంతో ఉత్పాదకత, సామర్థ్య లాభాలు పెరుగుతాయని, దేశ

ఏపీలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల కోసం హైకోర్టు న్యాయవాది దీక్ష..

అమరావతి, ఫిబ్రవరి 26:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలని కోరుతూ మాజీ జడ్జి, హైకోర్టు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ విజయవాడ ధర్నా చౌక్‌లో దీక్ష చేపట్టారు. నవరత్నాలకు సబ్‌ప్లాన్ నిధులను బదిలీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. ప్రభుత్వ పథకాలకు ఇచ్చిన నిధులను దారి మళ్లించడం చట్టానికి వ్యతిరేకమని పేర్కొన్నారు.

మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావ్ మాట్లాడుతూ.. ఏపీ సీఎం జగనును గెలిపించేందుకు గతంలో తాను రాష్ట్రం అంత పర్యటించనని, ఇక దించడానికి తిరుగుతానని వెల్లడించారు. మూడు ఏడేండ్ల ముఖ్యమంత్రి పాలనలో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర నిధులను కూడా ఏపీ ప్రభుత్వం దారి మళ్లిస్తుందని ఆయన వివరించారు. ప్రభుత్వం ఇకనైన తమ విధానాలను మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఎల్ఐసీలోకి విదేశీ పెట్టుబడులు ఇలా.. కేంద్రం నిర్ణయం ఇదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: త్వరలో ప్రారంభమయ్యే భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులకు తలుపులు తెరుచుకున్నాయి. ఎల్ఐసీ ఐపీవోలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 20 శాతం వరకు ఆటోమేటిక్ రూట్‌లో మదుపు చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర క్యాబినెట్ శనివారం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో వచ్చే ఏడాది స్టాక్ మార్కెట్లను తాకనున్న ఐపీవోలో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టడానికి ద్వారాలు తెరిచినట్లయింది.

ప్రస్తుతం అమలులో ఉన్న ఎఫ్‌డీఐ విధానానికి స్వల్ప సవరణలు తీసుకొచ్చినట్లు కేంద్ర ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. సులభంగా, ఎఫ్‌డీఐ ఫ్రేమ్‌వర్క్‌ను అర్థం చేసుకునేలా నిబంధనలు సవరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించేందుకు ఎఫ్‌డీఐ పాలసీలో సంస్కరణలు తోడ్పాటునిస్తాయన్నారు. తద్వారా భారీగా ఎఫ్‌డీఐ నిధుల రాకతో పెట్టుబడులు, ఆదాయం, ఉద్యోగాల్లో వృద్ధి నమోదవతుందని ఆ అధికారి కథనం.

1956 ఎల్ఐసీ చట్టం ప్రకారం.. ఈ సంస్థలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించేందుకు ప్రస్తుత ఎఫ్‌డీఐ పాలసీ అనుమతించదు. బీమా రంగ సంస్థల్లోకి మాత్రమే ఎఫ్‌డీఐ నిధులను అనుమతిస్తారు. కానీ ఎల్ఐసీ ఒక చట్టబద్ధమైన కార్పొరేషన్. 1956 ఎల్ఐసీ యాక్ట్ ప్రకారం ఈ కార్పొరేషన్ ఏర్పాటైంది. 1956 ఎల్ఐసీ యాక్ట్‌తోపాటు 1938 ఇన్సూరెన్స్ యాక్ట్, 1999 ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం ఎల్ఐసీలోకి నేరుగా విదేశీ పెట్టుబడులను అనుమతించరు.

ప్రస్తుత ఎఫ్‌డీఐ పాలసీ ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 20 శాతం ఎఫ్‌డీఐలను అనుమతించారు. ఇతర కార్పొరేట్ సంస్థల మాదిరిగానే ఎల్ఐసీలోకి 20 శాతం ఎఫ్‌డీఐలను అనుమతిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నది. ఐపీవో ద్వారా ఐదు శాతం వాటాల విక్రయానికి అనుమతించాలని ఈ నెల 13న ఎల్ఐసీ సెబీకి దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఐపీవో ద్వారా రూ.63 వేల కోట్ల నిధులు సేకరించాలని కేంద్రం లక్ష్యం.

గ్రామీణ ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు టిఎస్ఐసి ఆర్థిక సహకారం ...

-టిఎస్ఐసి చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత తౌటం

సంగారెడ్డి, ఫిబ్రవరి 26(నేటినిజం ప్రతినిధి): గ్రామీణ ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు టిఎస్ఐసి ఆర్థిక సహకారం కొరకు ఆవిష్కర్తల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టిఎస్ఐసి చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత తౌటం శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలకు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్స్ ఫర్ రూరల్ ఇంపాక్ట్ ఇన్సెంటివ్స్ (టీఎఖీఎఎ) ద్వారా ఆర్థిక సహకారం అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ సమస్యలను పరిష్కరించే ఆవిష్కరణలు మరియు స్టార్టప్‌లకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వ ఐ. టి ఉ సి విభాగం జూలై, 2021న ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేసిందని,సోడల్ ఏజెన్సీగా టిఎస్ఐసి వ్యవహరించనుందని పేర్కొన్నారు. ప్రోత్సాహకాల కోసం టీఎఖీఎఎ ద్వారా 30 లక్షల కార్పస్ ఫండ్ కేటాయించబడిందన్నారు. వివిధ దశల్లో ఉన్న ఆవిష్కరణలు, స్టార్టప్ లు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని గ్రామీణ సమస్యల పరిష్కారం కోసం అనేక ఆవిష్కరణలు వెలుగు చూస్తున్నాయనీ, వారికి ఆర్థిక చేయూత అందించి ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో దీనిని ప్రారంభించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొంది ఉన్న ఆవిష్కరణ, స్టార్టప్ లు లేదా పూర్తిగా రాష్ట్రంలోనే అభివృద్ధి చేయబడ్డ ఆవిష్కరణలకు ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేయుటకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోస+ https://teamtsic.telangana.gov.in/tsiri-incentives/ లో చూడవచ్చన్నారు. స్వీకరించబడిన దరఖాస్తులను టీఎఐ స్థాపించిన గ్రాస్‌రూట్ అడ్వైజరీ కౌన్సిల్ పరిశీలించి నిధులు అందజేస్తుందన్నారు.

పల్స్ పోలియో నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి-జిల్లా కలెక్టర్ హనుమంతరావు

జిల్లాలో ఈనెల 27 నుండి మార్చి1 వరకు పల్స్ పోలియో కార్యక్రమం.

సంగారెడ్డి, ఫిబ్రవరి 26 (నేటి నిజం ప్రతినిధి): పల్స్ పోలియో నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు . ఈ నెల 27 నుండి వరుసగా మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మొదటి రోజున(27న) పల్స్ పోలియో బూత్ లలో అప్పుడే పుట్టిన శిశువు నుండి మొదలుకుని ఐదేళ్ల లోపు చిన్నారులకు చుక్కల మందు వేయడం జరుగుతుందని, మిగతా రెండు రోజుల పాటు సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ పోలియో చుక్కలు వేయించని పిల్లలకు వేస్తారని అన్నారు. పల్స్ పోలియో వంద శాతం లక్ష్య సాధన కోసం ఆయా శాఖలు అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.సరిపడు పల్స్ పోలియో డోస్ లు సిద్ధంగా ఉన్నవని తెలిపారు. జిల్లాలో ఐదేళ్ల లోపు 1,86,190 చిన్నారులున్నారని, పల్స్ పోలియో చుక్కల మందు వేసేందుకు 1119 బూత్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో 922 గ్రామీణ ప్రాంతాల్లో, 197 బూతులు పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.36 మొబైల్ బృందాలు పని చేస్తాయని చెప్పారు. ఇట్టి కార్యక్రమ నిర్వహణ కోసం 4476 మంది వ్యాక్సినేటర్లు, 1583 మంది వైద్య సిబ్బంది,1344 మంది అంగన్వాడీ వర్కర్లు, 940 మంది ఆశ వర్కర్లు, 596 మంది ఇతర వాలంటీర్లు,10 ప్రోగ్రాం ఆఫీసర్లు విధులు నిర్వర్తించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టాస్క్ఫోర్స్ బృందాల ద్వారా పక్కాగా పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్ని బూతుల లో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. 0-5 సంవత్సరాల పిల్లలు అందరికీ తప్పని సరిగా చుక్కల మందు వేయించాలన్నారు. జిల్లాలోని అర్హులైన చిన్నారులకు విధిగా చుక్కల మందు వేయించే బాధ్యత తల్లిదండ్రుల తీసుకోవాలని ఆయన సూచించారు.

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు -ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ జాతీయ రోల్ అవుట్‌కు ఆమోద ముద్ర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కు కేంద్రం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో సమావేశమైన కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఐదేళ్లకు రూ. 1,600 కోట్ల బడ్జెట్‌తో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ సెక్టార్ స్కీమ్ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ంఃఆఓ) జాతీయ రోల్ అవుట్‌కు ఆమోద ముద్ర వేసింది. నేషనల్ హెల్త్ అథారిటీ .. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలు చేసే ఏజెన్సీగా ఉంటుంది.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా.. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణకు సమానమైన, సులువైన ప్రాప్యత బలోపేతం అవుతుంది. దీని కింద దేశ ప్రజలు తమ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ నంబర్‌ను జనరేట్ చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది.

దీంతో డిజిటల్ హెల్త్ రికార్డులను లింక్ చేసేందుకు అవకాశం ఉంటుందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ నేషనల్ రోల్-అవుట్ కోసం వచ్చే 5 సంవత్సరాలకు రూ. 1600 కోట్లను ఆమోదించనున్న ప్రధాన మంత్రికి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా ధన్యవాదాలు తెలిపారు. భారత పౌరులు ంఃఊం నంబర్ ద్వారా తమ ఆరోగ్య రికార్డులను ఒకే చోట ఉంచుకోగలరన్నారు. ంఃఊం నంబర్ త్వరిత, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కౌంట్ నంబర్ (ంఃఊం నంబర్) దేశంలో డిజిటల్ హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. దేశప్రజలు తమ ఆరోగ్య రికార్డులను డిజిటల్ మార్గంలో ఎక్కడైనా యాక్సెస్ చేయగలుగుతారు. లడఖ్, చండీగఢ్, దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూ, పుదుచ్చేరి, అండమాన్ మరియు నికోబార్ దీవులు మరియు లక్షద్వీప్‌లోని ఆరు కేంద్రపాలిత ప్రాంతాలలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ యొక్క పైలట్ ప్రాజెక్ట్ పూర్తయింది.

దళిత బాంధవుడు సీఎం కేసీఆర్ : ఎమ్మెల్యే నరేందర్

వరంగల్, ఫిబ్రవరి 26:: సీఎం కేసీఆర్ దళితబాంధవుడని, దళితుల జీవితాల్లో పెనుమార్పులు తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు వంద యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్న నేపథ్యంలో 18, 19, 20, 21 డివిజన్లకు చెందిన వారితో సీబీసీ చర్చ్ వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితుల ఆర్థిక స్వావలంభన కోసం దళితబంధు, వంద యూనిట్ల ఉచిత కరెంటు, ఎస్సీ సబ్‌ప్లాన్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. దళితులు, బహుజనులు ఆర్థిక పరిపుష్టి సాధించాలని రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చారన్నారు.

వంద యూనిట్ల ఉచిత కరెంటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరికీ అందే వరకు కొనసాగుతుందని, విడుదల వారీగా దళితబంధు అందజేస్తారన్నారు. సీబీసీ చర్చ్ అభివృద్ధి కృషి చేస్తామని, ఇప్పటికే పలుమార్లు నిధులు కేటాయించామని, ఇంకా అభివృద్ధి చేసేందుకు సహకారం అందిస్తామన్నారు. ఎన్నికలప్పుడు వచ్చే నాయకులతో ఒరిగేదేం లేదని, పేద ప్రజల బాగు కోసం చాలా ఓపికగ్గా పని చేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేసి చూపిస్తున్నామని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

జాతీయ వైజ్ఞానిక భాగంగా అల్ఫోర్స్ ఇ - టెక్నో స్కూల్ ఎడ్యూ ఎక్సెలెన్స్ -2022 "

కరీంనగర్ ఫిబ్రవరి 26: (నేటినిజం ప్రతినిధి): స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ - టెక్నో స్కూల్లో వేడుకగా నిర్వహించినటువంటి జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసినటువంటి అల్ఫోర్స్ ఎడ్యూ ఎక్సెలెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు . అంతకు ముందు వారు సి.వి.రామన్ గారి చిత్రపటానికి ఘనంగా పుష్పాంజలి ఘటించి ప్రారంభించారు . సి.వి.రామన్ గారు చిన్నతనం నుండే వైజ్ఞానిక శాస్త్రంలో గొప్ప విషయాలను కనుగొన్నారని మరియు అద్భుతంగా రాణించారని వారు చెప్పారు . తనదైన శైలితో విభిన్నమైన ఆలోచనలతో వెలుగుకి సంబంధించిన పరిశోధనలు చేసారని చెప్పారు . అతిచిన్న వయస్సులోనే భౌతిక శాస్త్రంలో కొత్త విషయాలను నేర్చుకొని అందులో నైపుణ్యాన్ని పొంది ఆ శాస్త్రానికే కేంద్ర బిందువుగా మారారని చెప్పారు . వారు విశిష్టమైన ఆలోచనలు పెంపొందించుకొని అద్భుతంగా రాణించి విశేషంగా ఖ్యాతి గడించారని కొనియాడారు . నేటికి వారి సలహాలు సూచనలు పలు దేశాలలో ఆచరణలో ఉన్నాయని మరియు వారు రూపొందించిన రామన్ ఎఫెక్ట్ నేటికి ఎన్నో సత్ఫలితాలిస్తుందని హర్షం వ్యక్తం చేస్తూ వారి మార్గదర్శకాలను తుచ తప్పకుండా ఆచరించి పాటించినట్లైతే అద్భుత ఫలితాలు సాధిస్తామని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెప్పారు . పాఠశాలలో వార్షిక విద్యాప్రణాళికలో భాగంగా విద్యార్థులకు వారి ఆలోచనలను తెలుపుతున్నామని మరియు కార్యరూపం దాల్చుతున్నామని చెప్పారు . వారి పేరుమీద నెలకొక్కసారి వైజ్ఞానిక శాస్త్రంకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టి వారిలో ఉన్న దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నామని చెప్పారు . అందులో భాగంగానే నేడు మన దేశంలో వారు కనుగొనట్టువంటి రామన్ఎ ఫెక్ట్ గుర్తించిన సందర్భంగా జరుపుకునేటువంటి జాతీయ వైజ్ఞానిక దినోత్సవంలో భాగంగా నేడు ఆల్ఫోర్స్ ఎడ్యూ ఎక్సెలెన్స్ అనే పేరుతో వైజ్ఞానిక ప్రదర్శనను చేపట్టడం జరిగినదని చెప్పారు . ఇందులో సుమారు 450 మంది విద్యార్థులు వివిధ ఆకర్షనీయమైన ఆలోచించ చేసే నమూనాలను రూపొందించి వీక్షకులకు మరియు సందర్శకులకు అత్యుత్తమంగా వర్ణించి చెప్పారు . మాడల్ ప్యాడి మండి , లైఫ్ , అటోమెటిక్ సోలార్ స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్ , ఎలక్ట్రోలైసిన్ , కెమికల్ చమేలియన్ , రేనో , కెమికల్ నేషనల్ ఫ్లాగ్ , డ్రిఫ్ ఇరిగేషన్ , స్టేజన్ ఆఫ్ ఫోటన్ , కరోన వైరన్ , ప్లాంట్ సెల్ ప్రత్యేకంగా విద్యార్థులు రూపొందించినటువంటి మ్యాజిక్ డోర్ , రసాయనంతో ఆనందం అద్భుతం నమూనాలు చాలా ఆకర్షింపచేసాయి . సందర్శనకు వచ్చిన తల్లిదండ్రులు , విద్యార్థులు వర్ణించిన విధానాలకు ఆకర్షితులై అభినందిచారు మరియు భవిష్యత్లో మరిన్ని అత్యుత్తమ నమూనాలు రూపొందించాలని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిల్ , తల్లిదండ్రులు ఉపాధ్యాయ భృందం పాల్గొన్నారు .

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి- అదనపు కలెక్టర్ రాజర్షి షా

సంగారెడ్డి, ఫిబ్రవరి 26(నేటినిజం ప్రతినిధి): జాతీయ పోలియో నిర్మూలన లో భాగంగా ఈ నెల 27న జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శనివారం నాడు కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది తో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నుండి జిల్లా ఆసుపత్రి వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. అన్ని ప్రయాణ ప్రాంగణాలు, తాత్కాలిక వలస కార్మికుల నివాస ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనుల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి 0-5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని ఆయన సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు ,స్వచ్ఛంద సంస్థలు ,యువజన సంఘాలు పల్స్ పోలియో కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ ర్యాలీ లో డిఎం అండ్హెచ్ఓ డాక్టర్ గాయత్రి దేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శశాంక్ దేశ్ పాండే, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎల్లయ్య, కళాశాల విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలవరాన్ని సందర్శించనున్న- కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర షెకావత్ వచ్చే నెల 4వ తేదీన పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఆయన తొలిసారి ఈ ప్రాజెక్టును సందర్శిస్తున్నారు. దాంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టును సందర్శించిన అనంతరం ఆయన అధికారులతో సమీక్షించనున్నారు. కేంద్ర మంత్రి పర్యటనలో ఏపీ సీఎం జగన్ కూడా పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పోలవరం ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. జాతీయ హోదా కలిగిన ప్రాజెక్టు కావడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వీలయినంత త్వరగా తెచ్చి పూర్తి చేయాలని భావిస్తుంది.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL- CUM I ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURTS: AT: SECUNDERABAD.

M.V.O.P.NO. 70 OF 2020

Between:

A.Dhana Lakshmi and others

...PETITIONERS

AND

G.Narender Reddy and others

...RESPONDENTS

N O T I C E

To

1.G. Narender Reddy
S/o. G. Ram Chandra Reddy
Aged about: 35 years, Occ: Driver of the DCM Vehicle No: TS-15-UC-8494.
R/o. H.No. MIG.B-6, Officers Colony, Secunderabad, Hyderabad-500003.

Please take notice that the above named petitioners have filed a case for compensation under M.V. Act, and the same was posted on **17.03.2022,** at 10.30.A.M. for your appearance and counter if any. If you fail to appear on that the day either in person or through an Advocate, otherwise the matter will be decided on merits.

(BY ORDER OF THE COURT)

M/S. T.RAJU, K.N.V.Ramani, T. Rahul, K.Adinarayana,
ADVOCATES,
Plot No.15,
Lakshmi Nagar Colony,
Secunderabad.

రాజన్నను దర్శించుకున్న సినీనటి మాజీ ఎంపీ విజయశాంతి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని శనివారం సినీనటి , మాజీ ఎంపీ బీజేపి సీనియర్ నాయకురాలు విజయశాంతి దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు , వేదపండితులు వేదోక్త ఆశీర్వచనంతో పాటు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు . రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపి అధ్యక్షుడు రామకృష్ణ , బీజెపి దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ , బీజెపి నాయకులు , కౌన్సిలర్లు ముప్పిడి సునంద ,అన్నారం ఉమారాణి స్వామి వారి చిత్రపటాన్ని .బహూకరించారు

జాతర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానంలో ఈ నెల 28 నుండి మార్చి 2 వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పార్కింగ్ స్థలం, టాయిలెట్లు, షవర్లు, ఆలయంలో క్యూ లైన్లు, ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. టాయిలెట్లు మరిన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే షవర్లు ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఉన్న మట్టిని శుభ్రం చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ వెంట జెడ్పీ సీఈవో గౌతం రెడ్డి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్ రావు, ఆలయ అధికారులు, తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రతి సంవత్సరం 100 కోట్లు ఇవ్వాలి

భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ నాయకురాలు మాజీ ఎంపీ విజయశాంతి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రతి సంవత్సరం 100 కోట్లు ఇస్తామన్న ముఖ్యమంత్రి కెసిఆర్ తన మాట తప్పాడని, వెంటనే గత ఏడు సంవత్సరాలుగా రావాల్సిన ఏడు వందల కోట్లు ఆలయ అభివృద్ధికి ఇవ్వాలని బీజేపీ నాయకురాలు ,మాజీ ఎంపీ విజయశాంతి అన్నారు.ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు ఇవ్వాలని శనివారం బిజెపి ఆధ్వర్యంలో ఆలయ మెట్లపై జరిగిన నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధిస్తే అందరూ అభివృద్ధి చెందుతారన్న ప్రజల ఆకాంక్షలను ముఖ్యమంత్రి కేసీఆర్ నీరుగార్చారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చేందుకు చేసిన వాగ్దానాలను అమలు చేయలేదని ఉద్యోగాలు లేక యువత ఆవేదన చెందుతున్నారని ఆరోపించారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రతి సంవత్సరం ఇస్తామన్న వంద కోట్లను ఇవ్వాలని, భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముందు విజయశాంతి శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ,జిల్లా బిజెపి అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రమ మహేష్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, ఎంపీపీ బండ మల్లేశం, జిల్లా అధికార ప్రతినిధి గోపు బాలరాజు, పట్టణ బీజెపి అధ్యక్షులు రేగుల సంతోష్ బాబు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంటి మహేష్, కౌన్సిలర్లు ముప్పిడి సునంద శ్రీనివాస్, అన్నారం ఉమారాణి శ్రీనివాస్ తో పాటు జిల్లా బిజెపి నాయకులు, మహిళా ప్రతినిధులు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు

విద్యార్థులలో ఓటు హక్కు పై అవగాహన కలిగించి పోటీలలో విరివిగా పాల్గొనే విధంగా ప్రేరణ కలిగించాలి- జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్

మెదక్, ఫిబ్రవరి 26, 2022(నేటి నిజం ప్రతినిధి): విద్యార్థులలో ఓటు హక్కు పై అ